

స్టార్ హోటళ్లకు శుభవార్త

- బార్ లైసెన్స్ ఫీజు భారీగా తగ్గింపు

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్టార్ హోటళ్లకు ఉపయోగపడేలా రాష్ట్ర మంత్రివర్గం గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ స్టార్ హోటళ్లలో బార్ లైసెన్స్ ఫీజు ఏడాదికి రూ.66 లక్షలు వసూలు చేస్తున్నారు. దీనిని ఇప్పుడు రూ.25 లక్షలు చేయడానికి పర్యాటక శాఖ చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తక్షణమే దీనిని అమలు చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయం పర్యాటక రంగానికి ఎంతో మేలు

... మిగతా 6వ పేజీలో

15% వృద్ధి లక్ష్యం

విజన్ డాక్యుమెంట్ కార్యాచరణకు అనుగుణంగా ప్రణాళికలు

- గడచిన ఏడాది జిల్లా స్థూల ఆదాయం రూ.1.33 లక్షల కోట్లు
- ఈ ఆర్థిక సంవత్సరం రూ.1.5 లక్షల కోట్లు లక్ష్యం
- పరిశ్రమలు, వ్యవసాయం, సర్వీస్ రంగాలపై దృష్టి
- పరిశ్రమల ఏర్పాటుకు 1,000 ఎకరాలు సేకరణ
- రైల్వే, టెలికమ్యూనికేషన్స్, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ పనులపై ప్రత్యేక శ్రద్ధ
- రూ.11 వేల కోట్లతో మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశ
- ఆగస్టులోగా టీసీఎస్ కార్యకలాపాలు
- భీమిలి బీచ్‌రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సులు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్



విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): **స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్ కార్యాచరణ అమలుకు సంబంధించి అధికారులకు లక్ష్యాలు నిర్దేశించామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వృద్ధిపై దృష్టిసారించామన్నారు.**

గురువారం తన ఛాంబర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ.1.33 లక్షల కోట్ల స్థూల ఆదాయం వచ్చిందని, 2025-26లో రూ.1.5 లక్షల కోట్లకు పెంచాలన్నదే విజన్ డాక్యుమెంట్ లక్ష్యమన్నారు. ప్రధానంగా వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీస్ రంగాల్లో 15 శాతం చొప్పున వృద్ధి, ఇంకా తలసరి ఆదాయం రూ.6,14,763 సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వ్యవసాయ రంగంలో మేలుజాతి వంగడాలతో వరి, రాగులు, పప్పు దినుసులు, మొక్కజొన్నలో దిగుబడి పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. 200 హెక్టార్ల బీడు భూములను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత శాఖకు నిర్దేశించామన్నారు. పశు సంవర్ధక శాఖ నుంచి ఏడాదికి రూ.మూడు వేల కోట్ల ఆదాయం వస్తోందని, దీనిపై 15 శాతం వృద్ధి సాధనకు మేలుజాతి ఆవులు పెంపకం, 125 గోకులాలు ఏర్పాటు, పౌల్ట్రీ పరిశ్రమ విస్తరణ, మేకలు, గొర్రెల పెంపకానికి రుణాలు మంజూరు వంటి వాటిపై దృష్టిసారిస్తామన్నారు. అదేవిధంగా ఫిషింగ్ హార్బర్‌లో 200 బోట్లకు కొత్త ఇంజన్లు అమర్చడం, పీఎం మత్స్య సంపద యోజన కింద రూ.80 లక్షల వంతున 10 బోట్లు కొనుగోలుకు ప్రతిపాదించామన్నారు. ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పూర్తయితే ఇప్పటివరకూ ఉన్న 700 బోట్లకు అదనంగా 70 బోట్లకు యాంకరేజ్ సదుపాయం లభిస్తుందన్నారు. సముద్రంలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు 30 చోట్ల కేజ్ కల్చర్ అమలు చేస్తామన్నారు. మత్స్యశాఖ ద్వారా గత ఏడాది రూ.2,700 కోట్ల ఆదాయం రాగా ప్రస్తుత ఏడాది అదనంగా మరో రూ.400 కోట్లు సమకూర్చుతామని కలెక్టర్ వెల్లడించారు.

పరిశ్రమల రంగం నుంచి వచ్చే ఆదాయంలో ప్రభుత్వ రంగం వాటా 23 శాతం, ప్రైవేటు రంగం వాటా 77గా ఉందని వివరించారు. ప్రభుత్వ రంగంలో పలు ప్రాజెక్టుల ద్వారా పనులు వేగవంతం చేయడం ద్వారా ఆదాయం పెరుగుతుందన్నారు. కాన్వెంట్ జంక్షన్ నుంచి షీలానగర్-సబ్బవరం వరకూ రహదారి నిర్మాణం, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ ద్వారా చేపట్టే పనులతో ఆర్థిక కార్యకలాపాలు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. మధురవాడలో యూజీడీ, నగరంలో తాగునీటి కల్పన ప్రాజెక్టులు అమలుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రూ.11 వేల కోట్లతో మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశ పనులు చేపట్టేందుకు వేగంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఇందుకు ప్రైవేటు భూమి 52 ఎకరాలు, ప్రభుత్వ భూమి 46 ఎకరాలు కావలసి వస్తుందన్నారు. ప్రైవేటు భూమి సేకరణకు రూ.620 కోట్లు అవసరమన్నారు. రూ.400 కోట్లతో విశాఖ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు చేపడతారని, త్వరలో జోన్ కార్యాలయం నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. విశాఖ పోర్టు లావాదేవీలు పెరగనున్నాయని, టెలికమ్యూనికేషన్స్ రంగంలో పనులు ప్రారంభం అవుతాయన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు తర్లువాడ, జగన్నాథపురం, కణమాం, బీడీ పాలెం, గోరంట్లలో 1000 ఎకరాలు సేకరిస్తున్నామన్నారు. పరిశ్రమలు నెలకొల్పేందుకు వచ్చే ఔత్సాహికులను అన్నివిధాలా ప్రోత్సహిస్తామన్నారు. ప్రతినెలా 100 ఎంఎస్ఎంఈ యూనిట్లు ప్రారంభమయ్యేలా సంబంధిత

... మిగతా 6వ పేజీలో

16 నుంచి స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

- కార్యాచరణ ప్రకటించిన నాయకులు
- కూర్మన్నపాలెం జంక్షన్‌లో రాస్తారోకో రేపు



ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నారు. కార్మికుల తొలగింపునకు నిరసనగా ఈ నెల 16వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు గురువారం ప్రకటించారు. స్టీల్ ప్లాంటులో ఇటీవల యాజమాన్యం 1,503 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించిన విషయం తెలిసిందే. కార్మికుల తొలగింపునకు నిరసనగా కొద్దికాలంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయానికి వచ్చారు.

కార్మిక సంఘాల కార్యాచరణ

5వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు కూర్మన్నపాలెం జంక్షన్ వద్ద రాస్తారోకో. 7న ఆర్ఎల్‌సీ సమక్షంలో చర్చల నేపథ్యంలో నిరసన ప్రదర్శన, 8న ఆర్ఎల్‌సీకి వినతి పత్రం, 9న ప్రతిపక్ష పార్టీల నాయకులకు వినతి పత్రాలు, 10న ఎంపీని కలిసి సమస్య వివరించి, వినతిపత్రం అందజేత, 16 నుంచి నిరవధిక సమ్మె

యాజమాన్యం దిగి వచ్చేంత వరకూ...

-అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

యాజమాన్యం దిగివచ్చేంత వరకూ పోరాటం ఆపేది లేదని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు

... మిగతా 6వ పేజీలో

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్



- నేటి నుంచి ప్రారంభం
- పది నిమిషాల్లో ప్రక్రియ పూర్తి
- మొదట సూపర్ బజార్ కార్యాలయంలో...
- దశల వారీగా అన్నిచోట్ల అమలు

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): **స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇకపై రిజిస్ట్రేషన్లను స్లాట్ బుకింగ్ విధానం ద్వారా చేయాలని నిర్ణయించింది. పాస్‌పోర్టు సేవలకు ఎలాగైతే ఆన్‌లైన్‌లో ముందుగా స్లాట్ బుక్ చేసుకొని నిర్ణీత సమయానికి వెళుతున్నారో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లకూ అలాగే చేయాలనేది ప్రభుత్వం ఆలోచన. దీనిని ప్రాథమికంగా జిల్లాకు ఒక కార్యాలయంలో శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నారు. విశాఖ జిల్లాలో సూపర్ బజార్ ఆవరణలో ఉన్న ఆర్ఓను ఎంపిక చేశారు.**

ఏమి చేయాలి?

డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకునే వారు రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఏ తేదీన వెళ్లాలనుకుంటున్నారో ఎంపిక చేసుకుంటే ఆ రోజు ఏ టైము అందుబాటులో ఉందో సూచిస్తుంది. దానిని సెలెక్ట్ చేసుకొని డాక్యుమెంట్లన్నీ అప్‌లోడ్ చేయాలి. ఫీజులన్నీ చెల్లించాలి. వాటిని సబ్ రిజిస్ట్రార్ పరిశీలించి ఓకే చేస్తారు. ఎంపిక చేసుకున్న తేదీన, సూచించిన సమయానికి సాక్షులతో వెళితే పది నిమిషాల్లో పని పూర్తి చేసేస్తారు. ఇప్పుడైతే గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది.ఇకపై ఆ ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.

స్లాట్ లేకుంటే సాయంత్రం 5.30 గంటల తరువాతే

సూపర్ బజారు ఆర్ఓలో రోజుకు 39 స్లాట్లు ఇస్తారు. స్లాట్ బుక్ చేసుకున్న వారికే రిజిస్ట్రేషన్లు చేస్తారు. ముందస్తు బుకింగ్ లేకుండా ఎవరైనా రిజిస్ట్రేషన్ కావాలనుకుంటే సాయంత్రం 5.30 గంటల తరువాతేనని డీఐజీ బాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. స్లాట్ బుకింగ్ కోసం కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని చెప్పారు.

దశల వారీగా ఇతర కార్యాలయాల్లో...

ఈ స్లాట్ బుకింగ్ విధానం విజయవంతమైతే దశల వారీగా అన్ని కార్యాలయాల్లోను అమలు చేయాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓ వారం రోజుల తరువాత మధురవాడలో, ఆ తరువాత ఇంకో కార్యాలయంలో ఇలా

... మిగతా 6వ పేజీలో

తీరంలో సందడి



రామకృష్ణా బీచ్ వద్ద గురువారం సాయంత్రం నీరు 50 మీటర్ల వరకూ వెనక్కి వెళ్లింది. ఎప్పుడు హోరెత్తించే అలలతో గర్జించే సముద్రుడు మౌనంగా దూరంగా ఉండడంతో పిల్లలు ఇసుకలో కేరింతలు కొడుతూ ఆనందించారు. కొద్దిరోజులుగా ఇక్కడ డ్రెడ్జింగ్ నిర్వహిస్తుండడం వల్లే ఆ ఇసుక మేటలుగా వేసిందని మత్స్యకారులు పేర్కొన్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

విశాఖ ఆర్చ్ బిషప్‌గా ఉడుముల బాల



హైదరాబాద్ అగ్ర పీఠాధిపతి నుంచి తాళాలు అందుకుంటున్న ఆర్చి బిషప్ బాలశౌరి

విశాఖ ఆర్‌సీఎం (రోమన్ క్యాథలిక్ మిషన్) ఆర్చి బిషప్‌గా గురువారం ఉడుముల బాలశౌరి బాధ్యతలు చేపట్టారు. జ్ఞానాపురం పునీత పేతురు దేవాలయం మైదానంలో భారీగా హాజరైన విశ్వాసుల మధ్య హైదరాబాద్ అగ్ర పీఠాధిపతి ఆంథోని తాళాలను అందించారు.

- 8లో

కూటమి శిబిరం

- భీమిలిలోని రిసార్ట్స్‌కు మూడు పార్టీల కార్పొరేటర్లు తరలింపు
- నేడు లేదా రేపు ఇతర రాష్ట్రాలకు...
- అవిశ్వాస తీర్మానంపై 19న కౌన్సిల్ సమావేశం జరగనుండడంతో నేతల అప్రమత్తం
- పది రోజుల నుంచి బెంగళూరులోనే వైసీపీ కార్పొరేటర్ల 'క్యాంపు'

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అవిశ్వాస తీర్మానం నోటీస్‌పై ఈనెల 19న కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో కూటమి కార్పొరేటర్లను ఆ పార్టీలనేతలు రహస్య శిబిరానికి తరలించారు. జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసు ఇవ్వగానే వైసీపీ కార్పొరేటర్లను ఆ పార్టీ నేతలు బెంగళూరు తరలించిన విషయం తెలిసిందే. గత నెల 29న జరిగిన జీవీఎంసీ బడ్జెట్ సమావేశానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్ మినహా వైసీపీ కార్పొరేటర్లు ఎవరూ హాజరుకాలేదు. తాజాగా అవిశ్వాస తీర్మానంపై 19న కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయం తీసుకోవడంతో కూటమి కార్పొరేటర్లను నేతలు శిబిరానికి తరలించారు. గతంలో స్టాండింగ్ కమిటీ ఎన్నిక జరిగినప్పుడు భీమిలిలోని ఒక రిసార్టులో ఉంచినందున, సెంటిమెంట్‌గా ఇప్పుడు కూడా అక్కడికే తరలించినట్టు తెలిసింది. శనివారం లేదా ఆదివారం వారిని అక్కడి నుంచి వేరే రాష్ట్రానికి తరలించే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈనెల 19 వరకు వారిని వివిధ రాష్ట్రాల్లోని సందర్శనీయ ప్రాంతాలు తిప్పే ఆలోచన ఉందని చెబుతున్నారు.

సీపీ ఆదేశాలు బేఖాతరు

- పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులో దుకాణాలు తొలగించాలని పోలీసులకు ఆదేశం
- అయినా సిబ్బంది తటపటాయింపు
- ఒకటి, రెండు చోట్ల తొలగించినా, ఆయన వెళ్లిపోగానే మళ్లీ యథాతథంగా ఏర్పాటు
- ఆశీలు కాంట్రాక్టర్ ప్రోత్సాహమే కారణమని ఆరోపణలు



పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులో ఆక్రమణలను పరిశీలిస్తున్న సీపీ

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆదేశాలను ఆ శాఖ సిబ్బంది పాటించకపోవడం చర్చనీయాంశంగా మారింది. పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డులో ఆక్రమణలను రెండు నెలల కిందట సీపీ చొరవతో పోలీసులు తొలగించారు. అయితే మార్కెట్‌లో ఆశీలు వసూలు కాంట్రాక్టును కూటమికి చెందిన చోటా నేత ఒకరు దక్కించుకోవడంతో మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం ప్రచురితమవ్వడంతో సీపీ శంఖబ్రతబాగ్చి గురువారం సాయంత్రం పూర్ణామార్కెట్

... మిగతా 6వ పేజీలో

మెడికల్ స్టోర్స్ ఇష్టారాజ్యంగా మందుల విక్రయాలు

- అధికారుల తనిఖీల్లో బయటపడిన కాలం చెల్లిన మందులు
- ప్రాణాలతో చెలగాటమాడుతున్న కొందరు నిర్వాహకులు
- ఔషధ నియంత్రణ మండలి పర్యవేక్షణ కొరవడడమే కారణం

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): **ఉమ్మడి జిల్లాలో కాలం చెల్లిన మందుల విక్రయాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. పర్యవేక్షించాల్సిన ఔషధ నియంత్రణ విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి శ్రుతిమించుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.**



గాజువాక ఎస్ఎస్‌వి మెడికల్ స్టోర్స్‌లో గత నెల 21న తనిఖీలు (ఫైల్ ఫొటో)

ఉమ్మడి జిల్లాలో అనేక మందుల దుకాణాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కాలం చెల్లిన మందులను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొన్నిచోట్ల ఫార్మసిస్టులు లేకుండానే మందుల విక్రయాలు సాగిస్తు న్నారు. స్టోర్స్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడంతో పాటు వాటిని పర్య వేక్షించాల్సిన ఔషధ నియంత్రణ విభాగం అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో నిర్వాహకులు రెచ్చిపోతున్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి మందులను విక్రయించకూడదన్నది నిబంధన. కానీ దీనిని పట్టించుకునే దుకాణాల నిర్వాహకులు లేరు. కొద్దిరోజుల కిందట విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్, ఈగల్ టీమ్, ఔషధ నియంత్రణ విభాగం అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

నగర పరిధిలోని 16 మందుల దుకాణాల్లో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి. రెండు మెడికల్ స్టోర్స్‌లో గడువు ముగిసిన మందులను గుర్తించారు. వీటిలో ఎంవీపీ కాలనీలోని త్యాగరాయ మెడికల్ స్టోర్స్‌లో సుమారు రూ.50 వేల విలువజేసే మందుల గడువు తీరినట్టు గుర్తించారు. గాజువాకలోని ఎస్ఎస్‌వీ మెడికల్ స్టోర్స్‌లో రూ.90 వేలు విలువ జేసే మందులను గుర్తించి, వాటిని సీజ్ చేసిన అనంతరం లైసెన్సులు రద్దు చేశారు. అలాగే మరో ఏడు దుకాణాల్లో ఫార్మాసిస్టులు లేకుండానే మందులు


... మిగతా 6వ పేజీలో

వికసించిన బుట్ట బొమ్మ!



- విశాఖ బయా డైవర్సిటీ పార్కులో అరుదైన పుష్పం
- చైనీస్ లాంతర్‌గా పిలుస్తారంటున్న నిర్వాహకులు

బుట్ట బొమ్మలా కనిపించే ఈ అరుదైన పుష్పం విశాఖ నగరంలోని పెదవాల్తేరు బయో డైవర్సిటీ పార్కులో గురువారం వికసించింది. ఆర్కిడ్ జాతికి చెందిన ఈ మొక్క దక్షిణ బ్రెజిల్, అర్జెంటీనా, ఉరుగ్వేలలో కనిపిస్తుంది. ప్రపంచంలోని ప్రసిద్ధ బొటానికల్ పార్కుల్లో మాత్రమే ఈ మొక్కలు పెంచుతారు. ఆకట్టుకునే రంగులతో బుట్టబొమ్మను తలపించేలా ఉండే ఈ పువ్వును చైనీస్ లాంతర్‌గా కూడా పిలుస్తారని పార్కు నిర్వాహకుడు ఎం.రామమూర్తి తెలిపారు. ఇవి ఆకర్షణీయంగా, సందర్శకులను ఆకట్టుకుంటాయన్నారు. జీవ వైవిధ్యానికి ప్రసిద్ధి చెందిన ఈ ఆర్కిడ్ జాతి మొక్కల్లో ఎన్నో ఔషధ గుణాలుంటాయన్నారు. - పెదవాల్తేరు, ఆంధ్రజ్యోతి



గర్భిణులకు అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భీమునిపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ప్రభుత్వాస్పత్రిలో గురువారం గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సాధారణ ప్రసవం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది అవగాహన కలిగించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.ఫణికుమార్, విజయశ్రీ పాల్గొన్నారు.

రూ.1.05 కోట్లతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం (రూరల్), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలోఉన్న భీమిలి జోనల్ పరిధిలో గల నాలుగు వార్డుల్లో రూ.1.05 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేయనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలో వివిధ రహదారులు, కాల్వల నిర్మాణాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ మొదటి విడతగా విడుదలైన నిధులతో కొన్ని రహదారుల నిర్మాణాలను చేపడుతున్నట్టు చెప్పారు. జాతీయ రహదారి నుంచి సంగివలస ప్రాథ మిక పాఠశాల వరకు ఒక రహదారి. వలందపేట రామాలయం వరకు మరో రహదారికి రూ.1.05 కోట్లు వెచ్చించనున్నట్టు చెప్పారు. అలాగే రూ.18.65 లక్షలతో గొల్లవీధి నుంచి సబ్బివానిపేట సీసీ రోడ్డుకు కూడా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎడదాసరి పేట, బంగ్లామెట్ట తదితర ప్రాంతాలలోల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి, జోనల్ కమిషనర్ ప్రసన్నరాణి, ఇతర అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



వలందపేట రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

16 నుంచి స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

... 5వ పేజీ తరువాయి

పేర్కొన్నారు. ప్లాంటులో గురువారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కార్మికులపై యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు.

ఈ తరుణంలో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 16 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఏ ఒక్క కార్మికుడినీ తొలగించబోమని యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నమ్మి రమణ, సోమరాజు, కె.వంశీ, అప్పారావు, భాస్కరరావు, ఆనంద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్టార్ హోటళ్లకు శుభవార్త

... 5వ పేజీ తరువాయి

చేస్తుందని ఏపీ టూరిజం ఫోరం కార్యదర్శి పవన్ కార్తీక్ అన్నారు. దీనివల్ల కార్పొరేట్, సోషల్ ఈవెంట్ల సంఖ్య పెరుగుతుందని, పర్యాటకుల సంఖ్య కూడా అధికం అవుతుందన్నారు. వ్యాపార అభివృద్ధికి అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు.

15% వృద్ధి లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

శాఖలకు లక్ష్యాలు నిర్దేశించామని వివరించారు. తగరపువలసలో ఆయిల్, ఎంవీపీ కాలనీలో ప్రింటింగ్, గాజువాకలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లు ఏర్పాటుచేస్తామన్నారు. సేవా రంగంలో ప్రధానంగా పర్యాటక, ఐటీ, ఆతిథ్య రంగాలపై ఫోకస్ పెట్టామన్నారు. ఈ ఏడాది ఆగస్టుకల్లా టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభించనున్నదని కలెక్టర్ చెప్పారు. ఐటీ హిల్స్‌లో ప్రస్తుతం ఉన్న సెజ్‌ను డీనోటిఫై చేయడానికి కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లాయన్నారు. స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ హబ్‌లను ప్రోత్సహిస్తామన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు విశాఖ నుంచి భీమిలి వరకూ బీచ్ రోడ్డులో మూడు డబుల్ డెక్కర్ బస్సులు నడపనున్నట్టు చెప్పారు. దీనికి సంబంధించి ప్యాకేజీ ఖరారు చేస్తామన్నారు. విజన్ డాక్యుమెంట్‌లో ఏఏ శాఖలు ఏమేం చేయాలన్నది నిర్దేశించామని, ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

సంప్రదాయబద్ధంగా అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామికి సంప్రదాయబద్ధంగా గురువారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఇందులోభాగంగా వేకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను సకల స్వర్ణాభరణలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయపద్మ నిధి నుంచి స్వర్ణ పుష్పాలను తీసి భక్తులతో స్పృశింపజేసి ఆలయ బేడామండప ప్రదక్షిణ చేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్కటి చొప్పున స్వర్ణ సంపెంగలతో పూజలు చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలను స్వామికిచ్చి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు ప్రసాదాలను అందజేశారు.



స్వర్ణ పుష్పాలతో అర్చన చేస్తున్న దృశ్యం

నేడు బీసీ రుణాల ఎంపికకు సమావేశం

భీమునిపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో బీసీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులతో బ్యాంకర్ల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు భీమిలి మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమ వివరాలు ఆధారాలు రుణ దరఖాస్తు వివరాలను తెలియజేయాలని అధికారులు కోరారు. లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

సీపీ ఆదేశాలు బేఖాతరు

... 5వ పేజీ తరువాయి

మెయిన్‌రోడ్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్డుపై దుకాణాలు పెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని సీపీ గమనించారు. ఆక్రమణలు తొలగించాలని, రోడ్డుపై దుకాణాలు ఉండడానికి వీల్లేదని సిబ్బందిని ఆదేశించారు. అయితే సీపీ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించే ప్రయత్నం సిబ్బంది చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. దుర్గాలమ్మ గుడి వరకూ నడుచుకుంటూ వెళ్లిన సీపీ రోడ్డుపై దుకాణాలు తొలగించాలని చెబితే పట్టించుకోరా?...అని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఒకటి, రెండు చోట్ల మాత్రమే ఆక్రమణలను ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. సీపీ వెళ్లిపోగానే తొలగించిన దుకాణాలను తిరిగి రోడ్డుపై ఏర్పాటుచేసుకున్నా అక్కడే ఉన్న పోలీసులు గానీ, జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గానీ అభ్యంతరం చెప్పకపోవడం ఆశ్చర్యపరిచింది. పోలీస్, జీవీఎంసీ అధికారులను ఆశీలు వేలం కాంట్రాక్టు దక్కించుకున్న కూటమి చోటా నేత ప్రసన్నం చేసుకున్నారని, అందుకే ఆయనకు సహకరిస్తున్నారని వ్యాపారులు భావిస్తున్నారు.

సత్యసాయి భక్తుల వితరణ



పేదలకు ఆహార పొట్లాలను అందిస్తున్న మంగమణి తదితరులు

తగరపువలస, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా గురువారం చిట్టివలసలో వెంటూరి మంగవేణి ప్రత్యేక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తన భర్త స్వర్గీయ నర్సింగరావు స్మృత్యర్థం నిరుపేద మహిళలకు ఆహార పొట్లాలను అందించారు రోడ్డుపక్క ఉంటున్న నిరుపేదలకు అన్నార్తులకు వీటిని అందజేశారు. నారాయణ సేవ పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు దాత మంగవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ విభాగానికి చెందిన పలువురు మహిళలు, ఇతర నాయకులు, చిట్టివలస సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వాంబే కాలనీకి జడ్సీ, కార్పొరేటర్

- శిథిల గృహాల పరిశీలన
- పలు సమస్యల గుర్తింపు
- ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి జడ్సీ హామీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మధురవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని వాంబే కాలనీ గృహాలను జోన్-2 కమిషనర్ కనకమహలక్ష్మీ, వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు తదితరులుగురువారం సందర్శించారు. అధ్వానంగా ఉన్న ఈ కాలనీలోని పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం "శిథిల ఇళ్లల్లో భయం..భయం' శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో జడ్సీ, కార్పొరేటర్, టీడీపీ నేతలు సందర్శించారు. ఆ కథనంలో ప్రస్తావించన గృహాల విషయమూ జడ్సీకి కార్పొరేటర్ వివరించారు. దీంతో వాంబేకాలనీలో పర్యటించి గృహాలకు పెచ్చులూడుతున్న విషయంతో పాటు, కల్వర్టులు, రహదారులు, తాగునీరు, వీధిలైట్లు తదితర సమస్యలను గుర్తించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రాధాన్యతా క్రమంలో వాంబే కాలనీలో మౌలికవసతులు కల్పించనున్నట్టు జడ్సీ తెలిపారు. కాలనీలో పెచ్చులూడుతున్న గృహాలపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు జడ్సీని కోరారు. ఈ విషయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివారావు దృష్టికి కూడా తీసుకెళ్ళనున్నట్టు వెంకటరావు తెలిపారు.



వాంబే కాలనీలో గృహాలను పరిశీలిస్తున్న జడ్సీ కనకమహలక్ష్మీ, టీడీపీ నేత వెంకటరావు

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

... 5వ పేజీ తరువాయి

అన్నిచోట్ల స్లాట్ బుకింగ్ కిందకు తీసుకువస్తారు.

సర్వర్ తట్టుకుంటుందా?

రిజిస్ట్రేషన్ల శాఖకు సర్వర్ సమస్య ఉంది. ఇది ఆకస్మికంగా మొండికేస్తుంది. ఆధార్ డేటా అప్‌డేట్ కాదు. డాక్యుమెంట్లు అప్‌లోడ్ కావు. ఇటువంటి పరిస్థితి వస్తే... స్లాట్ బుకింగ్ చేసుకున్న వారిని పని ఆ పది నిమిషాల్లో పూర్తి కాదు. అలాంటి వారు మళ్లీ రావాలనుకుంటే స్లాట్ రీ షెడ్యూల్ చేసుకోవలసి ఉంటుంది. దీనికి రూ.200 ఫీజు చెల్లించాలి. ప్రభుత్వం వల్ల జరిగిన జాప్యానికి తాము ఎందుకు ఫీజు కట్టాలని చాలామంది ప్రశ్నించే అవకాశం ఉంది. పైగా పది నిమిషాల్లో పూర్తవుతుందని హామీ ఇచ్చి, పని పూర్తి చేయకుండా వెనక్కి పంపించారనే విమర్శలు వస్తాయి. ఈ నేపథ్యంలో సర్వర సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉంది.



కప్పస్తంభం వద్ద ఏడీసీ దంపతులు

అప్పన్నను దర్శించుకున్న ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్

సింహాచలం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామిని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ జివెంకటస్వామి దంపతులు దర్శించుకున్నారు.గురువారం దర్శనానికి విచ్చేసిన వారికి ఆలయ అధికారులు ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్నాక వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలివ్వగా అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఫ్యాప్టో సభ్యుల నిరసన

పద్మనాభం-రూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ 30 శాతాన్ని తక్షణమే ప్రకటించాలని ఫ్యాప్టో సభ్యులు. డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సభ్యుడు ఉప్పాడ రాము మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న 12వ పీఆర్సీ, ఐఆర్‌ను ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. జీవో నంబర్-57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, మృతి చెందిన ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నిమాకాలు చేపట్టాలని, ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం పెట్టిన పోలీస్ కేసులను మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్యులు కె.సన్యాసిరావు, రామకృష్ణ, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల నిరసన

తగరపువలస, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు సంబంధించిన బిల్లును పార్లమెంటులో సరైన పద్ధతిలో ప్రవేశపెట్టనందుకు నిరసనగా కేంద్ర పింఛన్‌దారుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో గురువారం పెన్షన్‌దారులు ఆందోళన చేశారు. నగరంలోని కాకానినగర్‌లోని ఆడిట్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో చిట్టివలసకు చెందిన జూట్ పింఛన్‌దారులు బాబాజీ, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. కనీస పెన్షన్ కింద రూ.9 వేలు ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్‌తో ఆందోళన చేశారు.

బాలికల పట్ల కుటుంబ సభ్యుల్లా మెలగాలి

హాస్టల్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ సూచన

తగరపువలస, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు దూరంగా వసతిగృహంలో ఉంటూ చదువుకుంటున్న బాలికలతో కుటుంబ సభ్యుల మాదిరిగా మెలగాలని హాస్టల్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. చిట్టివలసలోని సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతిగృహాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికలకు అందుతున్న వసతి సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వంటగదులను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు.

ఇటీవల ఈ వసతిగృహం పాడైపోవడంతో ఆధునీకరించామన్నారు. బాలికలకు భోజన సదుపాయాలు, ప్రత్యేక వసతులను కల్పించడానికి సామగ్రిని దివీస్ యాజమాన్యం సమకూర్చిందన్నారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న బాలికల పర్యవేక్షణపై శ్రద్ధగా దృష్టి సారించాలని మేట్రిన్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, దివీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వంటశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కంప్యూటర్ కోడింగ్‌లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

ఆనందపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌వీపాలెంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు కంప్యూటర్ కోడింగ్‌లో మంచి ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయిలో కంప్యూటర్ కోడింగ్ నైపుణ్యాలపై అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ హాక్‌థాన్ పోటీలను విశాఖలోని హోటల్ గ్రీన్ పార్క్‌లో గురువారం నిర్వహించగా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కేజీబీవీలకు చెందిన 27 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఆనందపురం కేజీబీవీలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎల్.శకుంతల, బి.లేఖ్య, ఎల్.శశికళలు 'వేస్టు టు హెల్త్' ప్రాజెక్టులో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు పాఠశాలకు ఒక టీవీ, రెండు ల్యాప్‌టాప్‌లతో పాటు విద్యార్థినులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ జె.చంద్రశేఖర్, జీసీడీవో డాక్టర్ కలేశా, హెచ్‌ఎం లావణ్యలు విద్యార్థినులను అభినందించారు. అలాగే విద్యార్థినులకు తర్ఫీదునిచ్చిన గణిత ఉపాధ్యాయురాలు హైమావతిని ప్రశంసించారు.



బహుమతులు సాధించిన విద్యార్థినులతో అధికారులు

మెడికిల్ స్టోర్స్

... 5వ పేజీ తరువాయి

విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఆయా దుకాణాలపై 15 నుంచి 30 రోజుల సస్పెన్షన్ విధించారు.

కానరాని ప్రిస్కిప్షన్ రిజిస్టర్లు

మెడికల్ స్టోర్స్‌లో విక్రయించే మందులకు సంబంధించి ప్రిస్కిప్షన్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలి. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో రిజిస్టర్ అయిన వైద్యుడి ప్రిస్కిప్షన్ మేరకు మాత్రమే మందులను విక్రయించాలి. వాటిని ఎవరికి విక్రయించినదీ, వైద్యుడి ప్రిస్కిప్షన్ వివరాలతో తప్పనిసరిగా మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు రిజిస్టర్ నిర్వహించి భద్రపరచాలి. హోల్ సేలర్స్ వద్ద ఎన్ని మందులు కొనుగోలు చేసిందీ, ఎంతకు విక్రయించిందీ, మిగిలిన సరకు వివరాల రికార్డులను నిర్వహించాలని చట్టం చెబుతోంది. అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఆరు మెడికల్ స్టోర్స్‌లో ఈ రికార్డులు లేవని తేలింది. కొన్నిచోట్ల రికార్డులున్నప్పటికీ పూర్తిస్థాయిలో వివరాలు కనిపించలేదు.

అదుపులేని మత్తు మందుల విక్రయాలు

కొన్ని మెడికల్ స్టోర్స్‌లో మత్తు కలిగించే ఇంజక్షన్లు, మాత్రలు భారీగా విక్రయిస్తున్నారు. వీటిని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి తెస్తున్నట్టు చెబుతున్నారు.

కనిపించని పర్యవేక్షణ

ఔషధ నియంత్రణ విభాగం అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తూ మెడికల్ స్టోర్స్‌ను పర్యవేక్షించాలి. అటువంటిదేమీ నిర్వాహకులు ఇష్టం వచ్చినట్టుగా మందుల విక్రయాలు సాగిస్తున్నారు. గడువు ముగిసిన మందులను వినియోగించడంతో తీవ్ర దుష్పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. నగర పరిధిలో 3 వేలు, అనకాపల్లి జిల్లాలో 1,100, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 300 మెడికల్ స్టోర్స్ ఉన్నాయి.

వీటిని పర్యవేక్షించేందుకు విశాఖ జిల్లాలో ముగ్గురు, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు మరో ముగ్గురు మాత్రమే డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరంతా ప్రతినెలా 40 వరకు దుకాణాలను తనిఖీ చేయాలి. ఒకరిద్దరు మినహా తూతూమంత్రంగా పనిచేస్తున్నారనే విమర్శలున్నాయి. వీరిని కో-ఆర్డినేట్ చేయాల్సిన జిల్లాస్థాయి అధికారి పట్టనట్టు వ్యవహరిస్తుండడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెబుతున్నారు. ఈ విభాగం పనితీరుపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

ఎండాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎండాడ గ్రామానికి చెందిన పత్తి మురళీ తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల కోలుకున్నారు. ఆయనకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన మూడు లక్షల చెక్కును గురువారు భీమిలిలోని తన కార్యాలయంలో గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు సమక్షంలో మురళీకి అందజేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, టీడీపీ 8వ వార్డు అధ్యక్షుడు సి.గోపి, దొరబాబు, మంగాదేవి పాల్గొన్నారు.

హయగ్రీవ ప్రాజెక్టు స్థలానికి కంచె ఏర్పాటు

ఎండాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 8వ వార్డు పరిధి ఎండాడలో ఉన్న హయగ్రీవ ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలోకి ఎవరూ రాకపోకలు సాగించకుండా ఉండేందుకు వీఆర్వో ఇమ్రాన్ ఆధ్వర్యంలో సిబ్బంది సిమెంట్ పోల్స్ వేసి ఇనుప కంచెను గురువారం ఏర్పాటు చేశారు. ఎండాడలో హయగ్రీవడెవలపర్స్‌కు కేటాయించిన 12 ఎకరాల 512 సెంట్ల భూమిని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గతనెలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత భూమిని స్వాధీనం చేసుకుని ఇక్కడ బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతంఈ స్థలంలోకి ఎవరూ రాకుండా కంచె ఏర్పాటు చేశారు.



కంచె ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పొదుపు సంఘాల బలోపేతానికి ప్రణాళికలు

పద్మనాభం-రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామైక్య పొదుపు సంఘాల్లో సభ్యుల జీవనోపాధి పెంపుదలకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాలని వెలుగు ఏపీఎం సాయిరమేశ్ కోరారు. గురువారం వెలుగు కార్యాలయంలో 2025-2026 వార్షిక ప్రణాళికపై గ్రామాల ఎన్యూమరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాల్లో ఉన్న మహిళలకు కావాల్సిన వసతులపై సర్వే చేపట్టాలన్నారు. గతంలో రుణాలు పొందారా, సకాలంలో చెల్లింపులు చేశారా అనే అంశాలపై వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, ఐబీపీఎం ప్రతినిధి ప్రభాకర్, స్త్రీనిధి ఏజీఎం సునీత, ఏరియా కో-ఆర్డినేటర్ సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.


రెండు కార్లు ఢీ : ఇరువురికి గాయాలు

పద్మనాభం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో విశాఖపట్నం నుంచి వస్తున్న ఎం.రాజేష్ కారు, విజయనగరం నుంచి వస్తున్న సీహెచ్ లక్ష్మీప్రసాద్ కారు మద్ది ఇసుక గెడ్డ సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. రెండు కార్ల ముందుభాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బాధితులు ఇరువురూ విజయనగరం మహారాజా ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



ప్రమాదానికి గురైన కార్లు

ఆరిలోవలో కార్డన్ సెర్చ్



ఆరిలోవలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆరిలోవ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ పోలీసుస్టేషన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు పోలీసులు కార్డన్ సెర్చింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆరిలోవ, అప్పరా కాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సెర్చింగ్ చేసినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

ఈ సందర్భంగా 200 వాహనాల రికార్డులను పరిశీలించడం జరిగిందని తెలిపారు. వీటిలో సుమారు ఐదు వాహనాలకు రికార్డు లేకపోవడంతో వాటిని స్టేషన్‌కు తరలించినట్టు చెప్పారు. స్థానికులు సహకరించినందుకు వారికి సీఐ కృతజ్ఞతలు తెలిపారు.

దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

భీమునిపట్నం ఏప్రిల్ 03 (ఆంధ్రజ్యోతి) దంతాల సంరక్షణలో విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దంతవైద్యులు డా. శిరీష హనుమంతు పేర్కొన్నారు.

స్థానిక కిచిన్‌పేటలో బ్లూమింగ్ స్టార్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించారు. దంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, రాత్రి భోజనం తర్వాత దంతాలను శుభ్రం చేసుకుంటే మంచిదన్నారు. పాఠశాల సిబ్బంది సుకుమార్, రాజరాజేశ్వరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా

ఏయూలో వర్క్‌షాప్



సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపాల్ నరసింహారావు, పాల్గొన్న ఆచార్యులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా ఏయూ సంగీత నృత్య విభాగంలో గురువారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ అన్నమయ్య గురించి తెలియని వారు ఎవరూ ఉండరని పేర్కొన్నారు. అంత గొప్ప వ్యక్తి ఆయన అన్నారు. అన్నమయ్య జీవిత విశేషాలు తెలిపారు. విభాగాధిపతి ఆచార్య అనురాధ మాట్లాడుతూ తొలి తెలుగు వాగ్గేయకారుడు, సంకీర్తనాచార్యుడు అయిన అన్నమయ్య వేల కొలది రచనలు చేసిన మహా భక్తుడు అని కొనియాడారు. ఈ వర్క్‌షాప్‌లో పలువురు విద్యార్థులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో గురువారం సాయంత్రం గ్రామంలోని మహిళలు కోలాటం నిర్వహించారు. భక్తిపాటలతో వీరు నిర్వహించిన కోలాట నృత్యం భక్తులకు ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కర్రి వెంకట సూర్యఅప్పారావు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఏదో సాంస్కృతిక కార్యక్రమంతో ఉత్సవాలు కొనసాగిస్తున్నామన్నారు. అలాగే శుక్రవారం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత కచేరీ..

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించిన భక్తి సంగీత సంకీర్తన భక్తులను ఓలలాడించింది. శ్రీశ్రీ మ్యూజిక్ అకాడెమీ విద్యార్థులు సావదాన గరుడగమన, రామరామ, చూడరమ్మ తదితర అన్నమయ్య రామదాసు కీర్తనలు వీనుల విందుగా ఆలపించారు. కళాకారులు అనన్య, జైని, నితీష, సమీర బృందాన్ని ఆలయ కమిటీ సత్కరించింది.

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్** : జగదాంబ, శ్రీలీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),

● **పెళ్ళికాని ప్రసాద్** : శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)

● **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)

● **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 32,వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 12, క్యారెట్ 32 దొండకాయలు 24, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రతి వ్యక్తి భాగస్వామ్యం కావాలి

ఎకానమీ జాతీయ సదస్సులో హెచ్‌పీసీఎల్ డైరెక్టర్ (హెచ్‌ఆర్) సురేశ్ శెట్టి

వెంకోజీపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రతి వ్యక్తి భాగం కావాల్సిన అవసరం ఉందని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హ్యూమన్ రిసోర్సెస్) డైరెక్టర్ కె.సురేష్ శెట్టి అన్నారు. గురువారం ఏయూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అసెంబ్లీ మందిరంలో ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అండ్ సోషల్ ఈక్విలిటీ : రోడ్ మ్యాప్ టు వర్డ్స్ డెవలప్డ్ ఇండియా బై 2047'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవలు అందరికీ అందుబాటులో ఉంచడం, అందరూ వీటిని పొందేలా చూడటం, బాధ్యతాయుతమైన సేవలు అందించడం, సకాలంలో సేవలు అందించడం అనే ఈ నాలుగు ప్రధానమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆర్థిక సేవలను ప్రజలందరికీ చేరువ కావాల్సిన అవసరాన్ని వివరించారు. వైవిధ్యం కలిగిన భారతదేశంలో రాష్ట్రాల వారీగా కొంత వ్యత్యాసం ఉందని, వీటిని సమతౌల్యం చేస్తూ అందరిని అభివృద్ధిలో భాగస్వాములను చేయడం, ఆర్థికపరమైన సేవలు అందరికీచేరువ చేయడం ఎంతో అవసరమని చెప్పారు. ప్రధానంగా మహిళలు, యువతను దీనిలో భాగస్వాములను చేయడం అవసరమని తెలిపారు. భారతదేశం నేడు ఉపాధి అవకాశాలను సృష్టించే వేదికగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. హెచ్‌పీసీఎల్ సంస్థ ప్రత్యేకతలు విశిష్టతలను వివరించారు.



సురేశ్ శెట్టిని సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

ప్రత్యేక అతిథిగా విచ్చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిజినెస్ అండ్ ఆపరేషన్స్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ మాట్లాడుతూ ఫైనాన్షియల్ పవర్‌హౌస్‌గా భారత్ నిలవాలని సూచించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆర్థిక అక్షరాస్యత పెరగాలన్నారు. గ్రామ, పంచాయితీ స్థాయిలో దీనికి సంబంధించిన కార్యక్రమాలను విస్తృతంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలందరికీ ఆరికాభివృద్ధిలో భాగస్వాములను చేయడానికి నిర్వహిస్తున్న వివిధ పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి సాధిస్తున్న విధానాలను సోదాహరణంగా వివరించారు.

ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి విషయాలపైసామాన్య ప్రజలకు సైతం పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు సైతం ఇటువంటి విషయాలపైనా ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులను అభినందించి, అతిథులను సత్కరించారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఏయూ వీసీ రాజశేఖర్ అతిథులుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఆచార్య జాలాది రవి, పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న వార్షిక ఉత్సవాలకు ఎమ్మెల్యేలకు ఆహ్వానం



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి, విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సింహాచలం దేవస్థానం ఈవో సుబ్బారావు

సింహాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 3న జరగనున్న వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణం, చందనోత్సవాలకు రావాలంటూ నగరానికి చెందిన పలువురు రాజకీయ ప్రజాప్రతినిధులకు దేవస్థానం ఈవో కె.సుబ్బారావు స్వయంగా ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు. భీమిలి నియోజకవర్గ శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు తదితరులకు ఈవో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈవో శాలువాతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8న నిర్వహించనున్న సింహాచలం అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవానికి, 30 తేదీనాటి స్వామి చందనోత్సవానికి తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబుకు దేవస్థానం అధికారులు ఆహ్వానం అందించారు. గురువారం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు వచ్చిన వేద పండితులు వెలగపూడికి వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. శాలువతో కప్పి, అప్పన్న ప్రసాదాన్ని అందించారు.

స్నేహసంధ్య ఏజ్‌కేర్ సంస్థను సందర్శించిన వీఎంఆర్డీఏ చైర్మన్



నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రణవ్

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గంభీరం వద్ద ఉన్న స్నేహసంధ్య ఏజ్ కేర్ స్వచ్ఛంద సంస్థను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ గురువారం సందర్శించారు. ఆయనతో పాటు వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె .రమేష్ ఉన్నారు. సంస్థ నిర్వాహకులు నరేష్‌కుమార్, సాంబశివరావులు సంస్థ ప్రత్యేకతలు వివరించారు. సుమారు 90 మంది ఇన్ పేషెంట్స్, 150 బెడ్ల సామర్థ్యం కలిగి వృద్ధులకు అందించే సేవలు, భోజన వసతి, వైద్యం వంటి సౌకర్యాల గురించి వివరించారు. వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ వృద్ధులకు వచ్చే ఆరోగ్యసమస్యలకు ఇక్కడ అత్యాధునిక సౌకర్యాలతో వైద్యం అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు.

పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించడం తగదు

బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల ఆందోళన

మహారాణిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లు రూపంలో దొడ్డిదారిన పెన్షన్ నిబంధనలను సవరించడం వల్ల దేశంలో సుమారు 65 లక్షల మంది పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని జాయింట్ ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. మార్చి 25న కేంద్రం ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు గురువారం తీవ్రంగా నిరసించారు. డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జాయింట్ ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత బిల్లు ప్రకారం 2026 తరువాత రిటైర్ అయిన వారిని ఒక కేటగిరీగా, 2026 జనవరికి ముందు రిటైర్ అయిన వారిని మరో కేటగిరీగా విభజించారని తెలిపారు. ఇకపై కేంద్ర ప్రభుత్వ వేతన సంఘాలు ఇచ్చే నివేదికలో పెన్షన్ల సవరణ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్ల సవరణ ప్రభుత్వ విచక్షణ అధికారానికి లోబడి ఉండేలా బిల్లును పొందుపరిచారని పేర్కొన్నారు. పెన్షన్ దయాబిక్ష కాదని, ప్రభుత్వ ఉద్యోగి హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని వక్తలు గుర్తుచేశారు. పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించే ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించు కోవాలని, ఎనిమిదో వేతన సంఘం నివేదికలో బీఎస్ఎన్ఎల్ వేతన సవరణ అంశాన్ని చేర్చాలని, పెన్షనర్ల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న కార్మిక సంఘాల ప్రతినిధులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు

'నాసా' పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ఎన్.ఎ.డి.జంక్షన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాసా రీసెర్చి విభాగంలో అయాన్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన ప్రపంచ స్థాయి పోటీల్లో ఎన్ఏడీకి చెందిన నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎన్.ధనలక్ష్మి తెలిపారు. విద్యార్థులు ఈ ఘనత సాధించడం వెనక స్కూల్ యాజమాన్య ప్రోత్సాహం, ఉపాధ్యాయుల గైడెన్స్‌తో పాటు విద్యార్థుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తంగేటి బాల ఆదిత్య, ఆదిరెడ్డి నిహాల్ నాయుడు, ఎన్.జాయ్ చెర్రీ, ఇయ్యపు యువల్, ధనుశ్, ధవణేశ్వర్, కుశాల్ సాయి, యేగేంద్రలను యాజమాన్య ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం రాజ్‌కుమార్, స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీరామ్ నరేశ్, శ్రీప్రతాప్, ఇన్‌చార్జి సుభాని, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఉత్సవ రథానికి గ్రీన్‌సిగ్నల్

సింహాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) :సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణహోత్సవాలలో భాగమైన చేపట్టే రథోత్సవానికి ఆర్ అండ్ బీ కార్యనిర్వాహక ఇంజనీర్ విద్యాసాగర్ రథం పటిష్ఠంగా ఉందని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈనెల 8వ తేదీ రాత్రి 9గంటలకు రథసారధి కదిరి లక్ష్మణరావు బృందం ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. నిబంధనల మేరకు ఆర్అండ్‌బీ ఇంజనీరు రథాన్ని పరిశీలించి ధ్రువపరాచాల్సి ఉంది. ఈ మేర కు గురువారం రథ చక్రాలను, ఇరుసులను, జాకీ, స్టీరింగ్ వీల్ సాంకేతికంగా పరిశీలించి అనుమతి ఇచ్చారు. ఆయన వెంట దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈలు నాగేశ్వరరావు, సూరిబాబు, ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు, ఏఈ పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వీరంతా సింహాద్రినాథుని దర్శించుకున్నారు.



రథాన్ని పరిశీలిస్తున్న ఇంజినీర్లు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న హనుమాన్ శోభాయాత్ర జరుగనుంది. ఈ బైక్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఎంవీపీలోని తన స్వగృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లు

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం రాష్ట్రప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేస్తోందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా అడ్దూరులో 19.99 ఎకరాల్లో 146 ప్లాట్లు, విజయనగరం జిల్లా గరివిడిలో 21.30 ఎకరాల్లో 212 ప్లాట్లు, విశాఖ జిల్లా పాలవలసలో 76.96 ఎకరాల్లో 472 ప్లాట్లు వీఎంఆర్డీఏ అభివృద్ధి చేస్తోందని తెలిపారు. మురుగునీరు శుద్ధి చేసే వ్యవస్థ, భూగర్భ డ్రైనేజీ, బీటీ రోడ్లు, సీసీ రహదారులు, తాగునీటి సదుపాయం, పార్కులు వంటి సౌకర్యాలు వీటిలో కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రతి లే అవుట్‌లోను 10 శాతం ప్లాట్లు ప్రభుత్వం ఉద్యోగులకు, 5 శాతం ప్రభుత్వ పెన్షనర్లకు కేటాయించడం జరుగుతుందని, వీటి ధరలో పది శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో గురువారం వివిధ లేఅవుట్‌లలోని ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించారు. 113 మంది దరఖాస్తుదారులకు ప్లాట్లు కేటాయించారు. ఆసక్తి గలవారు ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు.



ప్లాట్లు పొందినవారికి పత్రాలు అందిస్తున్న అధికారులు

జీవీఎంసీ భవన సముదాయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

మద్దిలపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో నిర్మించనున్న జీవీఎంసీ నూతన భవవ సముదాయానికి గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రూ.1.68 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థలకు చేరుకోవడంతో కొత్త భవనం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పట్టణ ఆరోగ్యం కేంద్రం, షాపింగ్ కాంప్లెక్స్‌లకు ఈ భవనం వినియోగిస్తారని చెప్పారు. కాగా, ప్రస్తుతం ఉన్న పాత భవనంలో మూడు సచివాలయాలు, పోస్టాఫీస్, వార్డు కార్యాలయం, కిరణాదుకాణాలు నిర్వహించేవారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పాత భవనంలో స్థానంలో కొత్త భవన నిర్మాణం చేపట్టనున్నారు.

కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్, టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు, ప్రసాద్, డొక్కర శ్రీను, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించిన రూ. 3.89 లక్షల విలువైన చెక్కులను గంటా శ్రీనివాసరావు గురువారం సంబంధిత వ్యక్తులకు అందజేశారు. ఎంవీపీ కాలనీలో ఆయన స్వగృహంలో వీటిని పంపిణీ చేశారు. జీవీఎంసీ 8వ వార్డుకు చెందిన మురళికి రూ. 2.91 ల చెక్కు, భీమిలి మండలం టినగరపాలేనికి చెందిన తేజ్‌తన్వేష్‌కు రూ.49 వేల చెక్కు, 3వ వార్డుకు చెందిన వియ్యపు రఘునాథ్‌కు రూ.49 వేలు చెక్కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు గార్మెంట్ మేకింగ్, మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

ఆరిలోవ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ పాత పోలీసుస్టేషన్ సమీపంలో గల ఉర్వి విక్రమ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు గార్మెంట్ మేకింగ్, ఆర్యావర్క్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీలో ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. గత 30 ఏళ్లుగా మహిళలు, కౌమార బాలికల కోసం పని చేస్తున్న ఉర్వి విక్రమ్ చారిటబుల ట్రస్టు ఆధ్వర్యంలో ఈ శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపారు ఈ శిక్షణ ఏప్రిల్ 7 నుంచి శిక్షణ తరగతులు ఉంటాయని సంస్థ కో-ఆర్డి నేటర్ హరి వెంకటరమణ తెలిపారు. ఆరిలోవ పాత పోలీసు స్టేషన్ సమీపంలో గల సంస్థ కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణకు వయో పరిమితి లేదని తెలిపారు.

భర్త ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అత్తవారింటి నుంచి వెళ్లిన వ్యక్తి ఫోన్ కాల్‌కు అందుబాటులో లేకపోవడంతో ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పిఠాపురం కాలనీలో తన తల్లిదండ్రులతో ఉంటున్న యడ్లపల్లి దేదీప్యకు 2017లో యశ్వంత్ కుమార్‌తో వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. భర్తతో విభేదాల కారణంగా దేదీప్య కొద్ది కాలంగా తన తల్లిదండ్రులతో ఉంటోంది. ఉగాది పండుగ నేపథ్యంలో యశ్వంత్.. దేదీప్య ఇంటికి వచ్చాడు. తిరిగి 31న హైదరాబాద్ వెళ్లిపోతున్నట్టు చెప్పాడు. అయితే ఆ తర్వాత ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆమె యశ్వంత్ తల్లిదండ్రులను వాకబు చేసింది. తమ వద్దకు రాలేదని చెప్పారు. ఇదే సమయంలో ఒక ఫోన్ నెంబరు నుంచి మహిళ దేదీప్యకు ఫోన్ చేసి, నీ భర్తతో పదేళ్లుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు పేర్కొంది. దీంతో ఏం జరిగిందో తెలియక పోలీసులను ఆశ్రయించడంతో సీఐ మురళీ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉచితంగా పాలీసెట్ శిక్షణ తరగతులు



విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ కె.నారాయణరావు

కంచరపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా పాలీసెట్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. రాష్ట్ర సాంకేతిక శాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు శిక్షణ తరగతులకు హాజరు కావచ్చు. సుమారు 200 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు గురువారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఈ నెల 30న జరుగుతుంది. ఏప్రిల్ 15 వరకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలియజేశారు.

స్వచ్ఛ సర్వేలో ఉత్తమ ర్యాంకుకు కృషి చేయండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

అల్లిపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించి, జీవీఎంసీకి మంచి ర్యాంకు వచ్చేందుకు బాధ్యతతో పనిచేయాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయడుసచివాలయ కార్యదర్శులకు సూచించారు.గురువారం 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో సచివాలయాల సిబ్బంది, ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ప్రజలను స్వయంగా కలసి వారి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ఆర్‌ఐ .సీతారామయ్య పాల్గొన్నారు.

దుర్గాపురంలో విద్యుత్ సరఫరా నేడు నిలిపివేత

మాధవధార, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్ఏడీ కొత్తరోడ్డు సాకేతపురం దగ్గర నివాసిత ప్రాంతం దుర్గాపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ బి.కె. నాయుడు తెలిపారు.

బార్ కౌన్సిల్ నూతన అధ్యక్షుడికి అభినందన



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి అప్పన్నరెడ్డి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిల్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.కె.శ్రీనివాస్‌ను జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి, రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి బి.అప్పన్నరెడ్డి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అప్పన్నరెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ తండ్రి ఎం.కె.సీతారామయ్య బార్ కౌన్సిల్ అధ్యక్షునిగా, జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షునిగా సేవలందించారని, ఆయన బాటలో శ్రీనివాస్ కూడా సేవలందించాలని ఆకాంక్షించారు.

సంకీర్తనాచార్యునికి సత్కారం



వెంకటపతి స్వామిని సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య వాగ్గేయకారుడు, జగత్కళాపీఠ అధిపతి కె.వెంకటపతి స్వామికి గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో పదవీ విరమణ సత్కారం జరిగింది. సహృదయ సాహితి, జగత్కళాపీఠం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వెంకటపతి స్వామి రచించిన కీర్తనలను ద్వారం త్యాగరాజు శిష్యురాలు అక్కినపల్లి లక్ష్మీ శైలజ శ్రావ్యంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ రాజయోగి వెంకటపతి స్వామి ఆధ్యాత్మిక కృషి కొనసాగాలని ఆకాంక్షించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు వెంకటపతి స్వామిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, డాక్టర్ మరడాన సుబ్బారావు, డాక్టర్ సూరపనేని విజయకుమార్, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, సీహెచ్ చిన సూర్యనారాయణ, ముప్వ నాగరాజు శర్మ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం ప్రాంతంలో ఆకతాయిల హల్‌చల్!

» మద్యం, గంజాయి తాగుతూ అర్ధరాత్రి వరకు న్యూసెన్స్ » పోలీస్ నిఘా లేక మితిమీరుతున్న ఆగడాలు » స్థానికులు బెంబేలు

కంచరపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో ఆకతాయిలు, మందుబాబులు హల్‌చల్ చేస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఏ వీధిలో చూసినా పది నుంచి ఇరవై మంది వరకు కుర్రాళ్లు గుంపులుగా సెల్‌ఫోన్లు చూస్తూ బాటసారులను కామెంట్ చేస్తున్నారు.



ఓ ఇంటి ముందు పగులగొట్టిన పూలకుండీలు

రెడ్డికంచరపాలెం ఆర్చ్ దగ్గర నుంచి స్థానిక అమ్మా రెసిడెన్సీ వరకు, తోట వీధి, గొల్లకంచరపాలెం, వివేకానంద వీధి ప్రాంతాల్లో వీరి ఆగడాలకు అంతులేకుండా పోతుంది. గంటల తరబడి ఫోన్లతో ఆడుతూ అటుగా రాకపోకలు సాగించే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు వాపోతున్నారు. కొందరు యువకులు రోడ్డు మీదే మద్యం, గంజాయి తాగుతూ స్థానికులు, మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మహిళలు ఒంటరిగా వెళ్లడానికి సాహసించడం లేదంటే ఆకతాయి చేష్టలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులు విరుచుకుపడుతున్నారు. జీవీఎంసీ 56వ వార్డు పరిధి తోటవీధిలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను తగలబెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. పక్కనే ఉన్న మరో మూడు బైక్‌లు పాక్షికంగా కాలిపోయాయి. అదే విధంగా మరో ఇంటి ముందు ఉన్న పూల కుండీలను ధ్వంసం చేశారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కొందరు ఉద్దేశపూర్వకంగా వీధి దీపాలు ఆపేయడం, వాహనాల్లోని పెట్రోల్ దొంగిలించడం వం



తోటవీధిలో ఆకతాయిల దాడిలో దగ్ధమైన బైక్

టి చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి రెడ్డికంచరపాలెం ఆర్చ్ నుంచి అమ్మ రెసిడెన్సీ వరకు నెలకుని ఉంది. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

నవమి వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

మురళీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకల నిర్వహణకు మురళీనగర్ ప్రాంతంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మాధవధార మాధవ యువజన సమాజం నిర్వహణలో గల పురాతన రామాలయంలో కమిటీ సభ్యులు చలువ పందిళ్లు, క్యూలైన్లు కడుతున్నారు. మాధవధార ఉడాకాలనీ లక్ష్మీ గణపతి ఆలయంలోనూ ఉత్స



మాధవధార ఆలయంలో సీతారామలక్ష్మణులు

వాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నవమి పూజలకు అంకురార్పణగా శుక్రవారం సీతారాముల పెళ్లి రాట వేస్తారు. 5న పంచామృతాభిషేకం, అర్చనలు ఉంటాయి. నవమి రోజున (ఆదివారం) ఉదయం నుంచి మంగళ ధ్వని, నిత్యాభిషేకం తర్వాత 9 గంటలకు సీతారాముల ఉత్సవమూర్తుల శోభాయాత్ర, పట్టు వస్త్రాలతో అలంకరణ చేపడతారు. 11 గంటల 51 నిమిషాల శుభ ముహూర్తంలో సీతారాముల కల్యాణ వేడుకలు జరుగుతాయి. ఆలయ ఆవరణలో భక్తులకు విందు భోజనాలు, సాయంత్రం శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

అంబికా బాగ్‌లో 6న సీతారాముల కల్యాణం



శ్రీరామ నవమి వేడుకల నిర్వహణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

మహారాణిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అంబికాబాగ్‌లో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు 6న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారిణి కె.శోభారాణి తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణపై గురువారం అంబికాబాగ్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం 5 గంటలకు స్వామికి పంచామృతాభిషేకంతో పూజాది కార్యక్రమాలు ప్రారంభించి, 7న పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామన్నారు. స్వామి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు విరాళంగా ఇచ్చేవారి కోసం కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. వేడుకలకు సంబంధించిన బ్రోచర్‌ను అధికారులు ఆవిష్కరించారు. సహాయ కార్యనిర్వాహక అధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

మహిళలపై నేరాల కట్టడికి ప్రత్యేక పోలీసు స్టేషన్

ఐద్వా ప్రతినిధుల డిమాండ్

మహారాణిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని ఐద్వా మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. గురువారం కేజీహెచ్ మార్చురీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పి.మణి మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని హోంమంత్రి అనిత పరామర్శించి, తక్షణమే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మధురవాడ ప్రాంతంలో నేరాల సంఖ్య పెరుగుతున్నందున అదనంగా పోలీసు



కేజీహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

స్టేషన్, మహిళల రక్షణ నిమిత్తం ప్రతి ఏసీపీ పరిధిలో మహిళా పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ హయాంలోనూ గంజాయి, మద్యం విచ్చలవిడిగా లభిస్తుండడంతో మహిళలపై దాడులు, పిల్లలపై అత్యాచారాలు పెరిగాయని, దారుణ ఘటనలు మరువకముందే ఇంకోచోట భయోత్పాత సంఘటనలు వెలుగు చూడడం భయాందోళన కలిగిస్తోందన్నారు. సమావేశంలో నాయకులు ఎండీ బేగం, దేవుడమ్మ, పుష్ప, సుజాత, కొండమ్మ, సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, ఆర్‌కేఎస్వీ కుమార్, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు బాసటగా..

అక్కయ్యపాలెం/మురళీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారి బస్టాప్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం పాదచారులకు



అక్కయ్యపాలెం బస్టాప్ వద్ద మజ్జిగ అందిస్తున్న ఏడీసీ సోమన్నారాయణ



బిర్లా జంక్షన్ హైవే రోడ్డులో ప్రయాణికులకు పానీయాలు

మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. గ్రేటర్ 50వ వార్డులో హేమ అడోబ్స్ నిర్మాణ సంస్థ మజ్జిగ చలివేంద్రం ప్రారంభించింది. సంస్థ నిర్వాహకులు బొచ్చ సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని హైవే రోడ్డులో దీన్ని ఏర్పాటు చేశారు. వేసవి సీజన్ మొత్తం కొనసాగిస్తామని సురేష్ తెలిపారు. ప్రయాణికులు, స్థానికులకు ఎండల్లో ఉపశమనం కలిగేలా మజ్జిగ అందజేశారు. వేసవి రెండు నెలలు సాధారణ మంచినీటి చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు.

మలయవాసిని మధురగానం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లలితా పీఠంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రుల రామాయణ ప్రవచనాల్లో భాగంగా కుశలవుల పాటలపై గురువారం ఆచార్య కోలవెన్ను మలయవాసిని భావ సందేశమిచ్చారు. శ్రీరాముడి సీతాపరిత్యాగం కారణంగా జానపదులు శూర్పణఖ మాయను చిత్రించారని చెప్పారు. వాల్మీకి రామాయణంలో సీతను రాముడు విడిచిపెట్టడమే ఉంది.. కానీ స్త్రీల పాటల్లో రాముడు శూర్పణఖను సంహరించమని లక్ష్మణుడ్ని ఆజ్ఞాపించినట్లు ఉందని ప్రస్తావించారు. ఊర్మిళ తదితర వారి భావాలకు సంబంధించిన పాటలను గానం చేశారు. కుశలవుల రామకథాగాన విశేషాలను మలయవాసిని వివరించారు. కుశలవులు పాడినట్లుగా పేర్కొంటున్న నాలుగు పెద్ద పాటలను మలయవాసిని మధురంగా గానం చేశారు. అనంతరం ఆమెను పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణసేన్ సత్కరించారు. ఈ సభలో డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ కనకమహాలక్ష్మీ, భక్తులు పాల్గొన్నారు.



ప్రవచనం వినిపిస్తున్న మలయవాసిని

వ్యాధుల వివరాలు నమోదు చేయండి



చార్టులు అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జగదీశ్వరరావు

సీతమ్మధార, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రకాల వైద్య ఆరోగ్య కేంద్రాలు, ల్యాబ్ టెక్నీషియన్లు మలేరియా, డెంగ్యూ సంబంధిత రిజిస్టర్లు, చార్టులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లాలోని అన్ని ల్యాబ్‌లకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన మలేరియా, డెంగ్యూ రిజిస్టర్లు, చార్టులను గురువారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం వాటిని ల్యాబ్ టెక్నీషియన్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 73 పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వీటిని అందజేశామని, ప్రతి నెలా మలేరియా, డెంగ్యూ గణాంకాలు నమోదు చేసి దిన, వార, మాస, వార్షిక నివేదికలు సక్రమంగా తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ చిత్రాడ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

యూఎఫ్‌యూ టీ20 క్రికెట్ నాకౌట్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం నేతృత్వంలో యూఎఫ్‌యూ నిర్వహిస్తున్న చిన్నరాజు, రామరాజు స్మారక టీ 20 క్రికెట్ నాకౌట్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. వీడీసీఏ-బి గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి ఏసీఏ వీడీసీఏ స్టేడియం నిర్వాహక ఇన్‌చార్జి జెకెఎం.రాజు, అడ్మినిస్ట్రేటర్ రమేష్ బాబు, సీనియర్ అంపైర్ ఎస్.జోగారావు ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను ప్రారంభించారు. టోర్నీ నిర్వాహక కార్యదర్శి డేవిడ్ సునీల్, తేజ, మూర్తి, అఖిల్, బుర్రయ్య తదితరులు పాల్గొన్నారు. వీడీసీఏ-బి గ్రౌండ్‌తోపాటు హిందుస్తాన్ జింక్ గ్రౌండ్‌లో తొలిరోజు జరిగిన మ్యాచ్‌ల్లో గౌరి యూత్, ఉషోదయ సిసి, పెంటమాంబ సిసి, శారద సిసి జట్లు గెలుపొందాయి.



టాస్ వేస్తున్న అతిథులు జె.కె.ఎం.రాజు, రమేష్, జోగారావు

వీడీసీఏ-బి గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో గౌరి యూత్ సిసి ఏడు వికెట్ల తేడాతో మూన్ స్టార్ సిసిపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన మూన్‌స్టార్ 18.5 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌట్ కాగా, గౌరి యూత్ సిసి 14.5 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఉషోదయ సిసి 12 పరుగుల తేడాతో ప్రొఫెషనల్ సిసిపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఉషోదయ సిసి నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 164 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో ప్రొఫెషనల్ సిసి 19.1 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. జింక్‌గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో పెంటమాంబ సిసి ఏడు వికెట్ల తేడాతో కెంట్ సిసిపై గెలుపొందగా, మరో మ్యాచ్‌లో శారద సిసి 53 పరుగుల భారీ తేడాతో కెంట్ సిసిపై ఘన విజయం సాధించింది.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

... 5వ పేజీ తరువాయి

అన్నిచోట్ల స్లాట్ బుకింగ్ కిందకు తీసుకువస్తారు.

సర్వర్ తట్టుకుంటుందా?

రిజిస్ట్రేషన్ల శాఖకు సర్వర్ సమస్య ఉంది. ఇది ఆకస్మికంగా మొండికేస్తుంది. ఆధార్ డేటా అప్‌డేట్ కాదు. డాక్యుమెంట్లు అప్‌లోడ్ కావు. ఇటువంటి పరిస్థితి వస్తే.. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారిని పని ఆ పది నిమిషాల్లో పూర్తి కాదు. అలాంటి వారు మళ్లీ రావాలనుకుంటే స్లాట్ రీ షెడ్యూల్ చేసుకోవలసి ఉంటుంది. దీనికి రూ.200 ఫీజు చెల్లించాలి. ప్రభుత్వం వల్ల జరిగిన జాప్యానికి తాము ఎందుకు ఫీజు కట్టాలని చాలామంది ప్రశ్నించే అవకాశం ఉంది. పైగా పది నిమిషాల్లో పూర్తవుతుందని హామీ ఇచ్చి, పని పూర్తి చేయకుండా వెనక్కి పంపించారనే విమర్శలు వస్తాయి. ఈ నేపథ్యంలో సర్వర సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉంది.

15% వృద్ధి లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

శాఖలకు లక్ష్యాలు నిర్దేశించామని వివరించారు. తగరపువలసలో ఆయిల్, ఎంపీపీ కాలనీలో ప్రింటింగ్, గాజువాకలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లు ఏర్పాటుచేస్తామన్నారు. సేవా రంగంలో ప్రధానంగా పర్యాటక, ఐటీ, ఆతిథ్య రంగాలపై ఫోకస్ పెట్టామన్నారు. ఈ ఏడాది ఆగస్టుకల్లా టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభించనున్నదని కలెక్టర్ చెప్పారు. ఐటీ హిల్స్‌లో ప్రస్తుతం ఉన్న సెజ్‌ను డీనోటిఫై చేయడానికి కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లాయన్నారు. స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ హబ్‌లను ప్రోత్సహిస్తామన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు విశాఖ నుంచి భీమిలి వరకూ బీచ్ రోడ్డులో మూడు డబుల్ డెక్కర్ బస్సులు నడపనున్నట్టు చెప్పారు. దీనికి సంబంధించి ప్యాకేజీ ఖరారు చేస్తామన్నారు. విజన్ డాక్యుమెంట్‌లో ఏఏ శాఖలు ఏమేం చేయాలన్నది నిర్దేశించామని, ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

సీపీ ఆదేశాలు బేఖాతరు

... 5వ పేజీ తరువాయి

మెయిన్‌రోడ్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్డుపై దుకాణాలు పెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని సీపీ గమనించారు. ఆక్రమణలు తొలగించాలని, రోడ్డుపై దుకాణాలు ఉండడానికి వీల్లేదని సిబ్బందిని ఆదేశించారు. అయితే సీపీ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించే ప్రయత్నం సిబ్బంది చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. దుర్గాలమ్మ గుడి వరకూ నడుచుకుంటూ వెళ్లిన సీపీ రోడ్డుపై దుకాణాలు తొలగించాలని చెబితే పట్టించుకోరా?...అని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఒకటి, రెండు చోట్ల మాత్రమే ఆక్రమణలను ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. సీపీ వెళ్లిపోగానే తొలగించిన దుకాణాలను తిరిగి రోడ్డుపై ఏర్పాటుచేసుకున్నా అక్కడే ఉన్న పోలీసులు గానీ, జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గానీ అభ్యంతరం చెప్పకపోవడం ఆశ్చర్యపరిచింది. పోలీస్, జీవీఎంసీ అధికారులను ఆశీలు వేలం కాంట్రాక్టు దక్కించుకున్న కూటమి చోటా నేత ప్రసన్నం చేసుకున్నారని, అందుకే ఆయనకు సహకరిస్తున్నారని వ్యాపారులు భావిస్తున్నారు.

16 నుంచి స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

... 5వ పేజీ తరువాయి

పేర్కొన్నారు. ప్లాంటులో గురువారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కార్మికులపై యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ తరుణంలో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 16 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఏ ఒక్క కార్మికుడినీ తొలగించబోమని యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నమ్మి రమణ, సోమరాజు, కె.వంశీ, అప్పారావు, భాస్కరరావు, ఆనంద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మెడికిల్ స్టోర్స్

... 5వ పేజీ తరువాయి

విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఆయా దుకాణాలపై 15 నుంచి 30 రోజుల సస్పెన్షన్ విధించారు.

కానరాని ప్రిస్క్రిప్షన్ రిజిస్టర్లు

మెడికల్ స్టోర్స్‌లో విక్రయించే మందులకు సంబంధించి ప్రిస్క్రిప్షన్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలి. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో రిజిస్టర్ అయిన వైద్యుడి ప్రిస్క్రిప్షన్ మేరకు మాత్రమే మందులను విక్రయించాలి. వాటిని ఎవరికి విక్రయించినదీ, వైద్యుడి ప్రిస్క్రిప్షన్ వివరాలతో తప్పనిసరిగా మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు రిజిస్టర్ నిర్వహించి భద్రపరచాలి. హోల్ సేలర్స్ వద్ద ఎన్ని మందులు కొనుగోలు చేసిందీ, ఎంతకు విక్రయించిందీ, మిగిలిన సరకు వివరాల రికార్డులను నిర్వహించాలని చట్టం చెబుతోంది. అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఆరు మెడికల్ స్టోర్స్‌లో ఈ రికార్డులు లేవని తేలింది. కొన్నిచోట్ల రికార్డులున్నప్పటికీ పూర్తిస్థాయిలో వివరాలు కనిపించలేదు.

అదుపులేని మత్తు మందుల విక్రయాలు

కొన్ని మెడికల్ స్టోర్స్‌లో మత్తు కలిగించే ఇంజక్షన్లు, మాత్రలు భారీగా విక్రయిస్తున్నారు. వీటిని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి తెస్తున్నట్టు చెబుతున్నారు.

కనిపించని పర్యవేక్షణ

ఔషధ నియంత్రణ విభాగం అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తూ మెడికల్ స్టోర్స్‌ను పర్యవేక్షించాలి. అటువంటిదేమీ నిర్వాహకులు ఇష్టం వచ్చినట్టుగా మందుల విక్రయాలు సాగిస్తున్నారు. గడువు ముగిసిన మందులను వినియోగించడంతో తీవ్ర దుష్పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. నగర పరిధిలో 3 వేలు, అనకాపల్లి జిల్లాలో 1,100, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 300 మెడికల్ స్టోర్స్ ఉన్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు విశాఖ జిల్లాలో ముగ్గురు, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు మరో ముగ్గురు మాత్రమే డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరంతా ప్రతినెలా 40 వరకు దుకాణాలను తనిఖీ చేయాలి. ఒకరిద్దరు మినహా తూతూమంత్రంగా పనిచేస్తున్నారనే విమర్శలున్నాయి. వీరిని కో-ఆర్డినేట్ చేయాల్సిన జిల్లాస్థాయి అధికారి పట్టనట్టు వ్యవహరిస్తుండడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెబుతున్నారు. ఈ విభాగం పనితీరుపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

స్టార్ హోటళ్లకు శుభవార్త

... 5వ పేజీ తరువాయి

చేస్తుందని ఏపీ టూరిజం ఫోరం కార్యదర్శి పవన్ కార్తీక్ అన్నారు. దీనివల్ల కార్పొరేట్, సోషల్ ఈవెంట్ల సంఖ్య పెరుగుతుందని, పర్యాటకుల సంఖ్య కూడా అధికం అవుతుందన్నారు. వ్యాపార అభివృద్ధికి అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు.

మానవ సేవకు ఇదో తోవ!

నగరంలో సంచరిస్తూ అనాథలకు సేవ చేస్తున్న క్షురకుడు

మహారాణిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సంకల్పం ఉండాలే గాని డబ్బుతో పని లేకుండా ఏదో ఒక రూపంలో మానవసేవ చేయొచ్చని నిరూపిస్తున్నాడు పట్నాల చిన్నారావు. తన చేతి వృత్తితోనే అనాథలు, వృద్ధులు, నిరాశ్రయులకు ఉచితంగా క్షవరం చేసి, కొందరికి స్నానం చేయిస్తూ, తన సంతృప్తిని వెతుక్కున్నాడు.

పట్నాన చిన్నారావు ఇరవై ఏళ్ల క్రితం పార్వతీపురం మన్యం జిల్లా మార్కొండపుట్టి గ్రామం నుంచి పొట్టకూటి కోసం తన అన్న గంగరాజుతో కలసి వచ్చాడు. తమకు తెలిసిన క్షురక వృత్తి చేపట్టారు. ముందుగా అన్నదమ్ములు ఫుట్‌పాత్‌పై క్షవరం చేస్తూ పనిలో నైపుణ్యత కనబరిచి అంచెలంచెలుగా ఎదిగారు. మహారాణిపేటలోని రామ్‌నగర్‌లో సెలూన్ షాపు ఏర్పాటు చేసుకున్నారు. ఆ తరువాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. తమ చేతి వృత్తి నైపుణ్యంతో పదుగురినీ ఆకట్టుకుంటూ జీవితంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో తనకు ఏదైనా సేవ చేయాలని చిన్నారావుకు అనిపించింది. రోడ్లపై అనాథలు, వృద్ధులు, మానసిక వికలాంగులు ఒంటరిగా, అపరిశుభ్రతతో ఉండడం గమనించాడు. ప్రతి మంగళవారం తన సెలూన్ షాపునకు సెలవు దినం కావటంతో ఆ రోజును మానవసేవ చేయాలని సంకల్పించాడు. కేజీహెచ్, బీచ్‌రోడ్డు, జగదాంబ జంక్షన్, వన్‌టౌన్, రామ్‌నగర్, వాల్తేర్, రైల్వేస్టేషన్, బస్‌కాంప్లెక్షుతోపాటు అనాథాశ్రమాలకు వెళ్లి రోడ్లపై సంచరించే అనాథలు, వృద్ధులను చేరదీసి, వారికి నచ్చజెప్పి బాగా పెరిగిపోయిన వారి జుత్తును కత్తిరిస్తున్నాడు. చేతిపంపులు, వీధి కుళాయిల వద్ద వారికి స్నానం చేయిస్తున్నాడు. "పొట్టకూటికి నగరానికి వచ్చాం.. స్థిరపడ్డాం... తమకు తోచిన సేవలు అందిస్తున్నామ"ని తెలిపాడు. చిన్నారావు అందిస్తున్న సేవలను పలువురు అభినందిస్తున్నారు.



ఓ అభాగ్యునికి క్షవరం చేశాక స్నానం చేయిస్తున్న పట్నాల చిన్నారావు

అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా

ఏయూలో వర్క్‌షాప్



సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపాల్ నరసింహారావు, పాల్గొన్న ఆచార్యులు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అన్నమాచార్య వర్ధంతి సందర్భంగా ఏయూ సంగీత నృత్య విభాగంలో గురువారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ అన్నమయ్య గురించి తెలియని వారు ఎవరూ ఉండరని పేర్కొన్నారు. అంత గొప్ప వ్యక్తి ఆయన అన్నారు. అన్నమయ్య జీవిత విశేషాలు తెలిపారు. విభాగాధిపతి ఆచార్య అనురాధ మాట్లాడుతూ తొలి తెలుగు వాగ్గేయకారుడు, సంకీర్తనాచార్యుడు అయిన అన్నమయ్య వేల కొలది రచనలు చేసిన మహా భక్తుడు అని కొనియాడారు. ఈ వర్క్‌షాప్‌లో పలువురు విద్యార్థులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం



కోలాటం ఆడుతున్న మహిళలు

వెంకోజీపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో గురువారం సాయంత్రం గ్రామంలోని మహిళలు కోలాటం నిర్వహించారు. భక్తిపాటలతో వీరు నిర్వహించిన కోలాట నృత్యం భక్తులకు ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కర్రి వెంకట సూర్యఅప్పారావు మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజూ ఏదో సాంస్కృతిక కార్యక్రమంతో ఉత్సవాలు కొనసాగిస్తున్నామన్నారు. అలాగే శుక్రవారం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గౌరవ అధ్యక్షులు మళ్ల పోలిరాజు ఇతర కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత కచేరీ..

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులోని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించిన భక్తి సంగీత సంకీర్తన భక్తులను ఓలలాడించింది. శ్రీశ్రీ మ్యూజిక్ అకాడెమీ విద్యార్థులు సావధాన గరుడగమన, రామరామ, చూడరమ్మ తదితర అన్నమయ్య రామదాసు కీర్తనలు వీనుల విందుగా ఆలపించారు. కళాకారులు అనన్య, జైని, నితీష, సమీర బృందాన్ని ఆలయ కమిటీ సత్కరించింది.

సినిమా గైడ్

- **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **మ్యాడ్2:** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
- **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య(గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
- **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 13, వంకాయలు (తెలుపు) 32,వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 30, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 32 దొండకాయలు 24, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 110, బద్దచిక్కుడు 54, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 105, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 50, కీరదోస 22, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 30 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 60, గోరుచిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	460
విజయనగరం	464
శ్రీకాకుళం	464

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	118
లైవ్ ధర	138
విత్ స్కిన్	246
స్కిన్‌లెస్	256

దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రతి వ్యక్తి భాగస్వామ్యం కావాలి

ఎకానమీ జాతీయ సదస్సులో హెచ్‌పీసీఎల్ డైరెక్టర్ (హెచ్‌ఆర్) సురేశ్ శెట్టి



సురేశ్ శెట్టిని సత్కరిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : దేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రతి వ్యక్తి భాగం కావాల్సిన అవసరం ఉందని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హ్యూమన్ రిసోర్సెస్) డైరెక్టర్ కె.సురేష్ శెట్టి అన్నారు. గురువారం ఏయూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అసెంబ్లీ మందిరంలో ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇంక్లూజన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ఫైనాన్షియల్ ఇంక్లూజన్ అండ్ సోషల్ ఈక్వాలిటీ : రోడ్ మ్యాప్ టు వర్డ్స్ డెవలప్డ్ ఇండియా బై 2047ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవలు అందరికీ అందుబాటులో ఉంచడం, అందరూ వీటిని పొందేలా చూడటం, బాధ్యతాయుతమైన సేవలు అందించడం, సకాలంలో సేవలు అందించడం అనే ఈ నాలుగు ప్రధానమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆర్థిక సేవలను ప్రజలందరికీ చేరువ కావాల్సిన అవసరాన్ని వివరించారు. వైవిధ్యం కలిగిన భారతదేశంలో రాష్ట్రాల వారీగా కొంత వ్యత్యాసం ఉందని, వీటిని సమతౌల్యం చేస్తూ అందరిని అభివృద్ధిలో భాగస్వాములను చేయడం, ఆర్థికపరమైన సేవలు అందరికీచేరువ చేయడం ఎంతో అవసరమని చెప్పారు. ప్రధానంగా మహిళలు, యువతను దీనిలో భాగస్వాములను చేయడం అవసరమని తెలిపారు. భారతదేశం నేడు ఉపాధి అవకాశాలను సృష్టించే వేదికగా నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. హెచ్‌పీసీఎల్ సంస్థ ప్రత్యేకతలు విశిష్టతలను వివరించారు.

ప్రత్యేక అతిథిగా విచ్చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిజినెస్ అండ్ ఆపరేషన్స్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ మాట్లాడుతూ ఫైనాన్షియల్ పవర్‌హౌస్‌గా భారత్ నిలవాలని సూచించారు. దేశ ఆర్థికాభివృద్ధిలో బ్యాంకుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఆర్థిక అక్షరాస్యత పెరగాలన్నారు. గ్రామ, పంచాయితీ స్థాయిలో దీనికి సంబంధించిన కార్యక్రమాలను విస్తృతంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే సమయంలో సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలందరికీ ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములను చేయడానికి నిర్వహిస్తున్న వివిధ పథకాలు, వాటిని సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి సాధిస్తున్న విధానాలను సోదాహరణంగా వివరించారు.

ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ ఇటువంటి విషయాలపైసామాన్య ప్రజలకు సైతం పూర్తి స్థాయి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు సైతం ఇటువంటి విషయాలపైనా ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులను అభినందించి, అతిథులను సత్కరించారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఏయూ వీసీ రాజశేఖర్ అతిథులుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఆచార్య జాలాది రవి, పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న వార్షిక ఉత్సవాలకు ఎమ్మెల్యేలకు ఆహ్వానం



భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి, విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సింహాచలం దేవస్థానం ఈవో సుబ్బారావు

సింహాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 3న జరగనున్న వరాహలక్ష్మీనృసింహ స్వామి వార్షిక తిరుకల్యాణం, చందనోత్సవాలకు రావాలంటూ నగరానికి చెందిన పలువురు రాజకీయ ప్రజాప్రతినిధులకు దేవస్థానం ఈవో కె.సుబ్బారావు స్వయంగా ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు. భీమిలి నియోజకవర్గ శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యుడు విష్ణుకుమార్‌రాజు తదితరులకు ఈవో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈవో శాలువాతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 8న నిర్వహించనున్న సింహాచలం అప్పన్న వార్షిక తిరు కల్యాణోత్సవానికి, 30 తేదీనాటి స్వామి చందనోత్సవానికి తూర్పు నియోజకవర్గం శాసన సభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబుకు దేవస్థానం అధికారులు ఆహ్వానం అందించారు. గురువారం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు వచ్చిన వేద పండితులు వెలగపూడికి వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. శాలువతో కప్పి, అప్పన్న ప్రసాదాన్ని అందించారు.

స్నేహసంధ్య ఏజ్‌కేర్ సంస్థను సందర్శించిన వీఎంఆర్డీఏ చైర్మన్



నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రణవ్

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : గంభీరం వద్ద ఉన్న స్నేహసంధ్య ఏజ్ కేర్ స్వచ్ఛంద సంస్థను వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ గురువారం సందర్శించారు. ఆయనతో పాటు వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ కె .రమేష్ ఉన్నారు. సంస్థ నిర్వాహకులు నరేష్‌కుమార్, సాంబశివరావులు సంస్థ ప్రత్యేకతలు వివరించారు. సుమారు 90 మంది ఇన్ పేషెంట్స్, 150 బెడ్ల సామర్థ్యం కలిగి వృద్ధులకు అందించే సేవలు, భోజన వసతి, వైద్యం వంటి సౌకర్యాల గురించి వివరించారు. వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ వృద్ధులకు వచ్చే ఆరోగ్యసమస్యలకు ఇక్కడ అత్యాధునిక సౌకర్యాలతో వైద్యం అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు.

పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించడం తగదు

బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల ఆందోళన



ఆందోళనలో పాల్గొన్న కార్మిక సంఘాల ప్రతినిధులు

మహారాణిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లు రూపంలో దొడ్డిదారిన పెన్షన్ నిబంధనలను సవరించడం వల్ల దేశంలో సుమారు 65 లక్షల మంది పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతారని జాయింట్ ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. మార్చి 25న కేంద్రం ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు గురువారం తీవ్రంగా నిరసించారు. డాబాగార్డెన్స్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద జాయింట్ ఫోరం ఆఫ్ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత బిల్లు ప్రకారం 2026 తరువాత రిటైర్ అయిన వారిని ఒక కేటగిరీగా, 2026 జనవరికి ముందు రిటైర్ అయిన వారిని మరో కేటగిరీగా విభజించారని తెలిపారు. ఇకపై కేంద్ర ప్రభుత్వ వేతన సంఘాలు ఇచ్చే నివేదికలో పెన్షన్ల సవరణ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్ల సవరణ ప్రభుత్వ విచక్షణ అధికారానికి లోబడి ఉండేలా బిల్లును పొందుపరిచారని పేర్కొన్నారు. పెన్షన్ దయాబిక్ష కాదని, ప్రభుత్వ ఉద్యోగి హక్కు అని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని వక్తలు గుర్తుచేశారు. పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించే ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించు కోవాలని, ఎనిమిదో వేతన సంఘం నివేదికలో బీఎస్ఎన్ఎల్ వేతన సవరణ అంశాన్ని చేర్చాలని, పెన్షనర్ల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు

'నాసా' పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ఎన్.ఎ.డి.జంక్షన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాసా రీసెర్చి విభాగంలో అయాన్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన ప్రపంచ స్థాయి పోటీల్లో ఎన్ఏడీకి చెందిన నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్.ధనలక్ష్మి తెలిపారు. విద్యార్థులు ఈ ఘనత సాధించడం వెనక స్కూల్ యాజమాన్య ప్రోత్సాహం, ఉపాధ్యాయుల గైడెన్స్‌తో పాటు విద్యార్థుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తంగేటి బాల ఆదిత్య, ఆదిరెడ్డి నిహాల్ నాయుడు, ఎన్.జాయ్ చెర్రీ, ఇయ్యపు యువల్, ధనుష్, ధవనేశ్వర్, కుశాల్ సాయి, యేగేంద్రలను యాజమాన్య ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం రాజ్‌కుమార్, స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీరామ్ నరేశ్, శ్రీప్రతాప్, ఇన్‌చార్జి సుభాని, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఉత్సవ రథానికి గ్రీన్‌సిగ్నల్



రథాన్ని పరిశీలిస్తున్న ఇంజినీర్లు

సింహాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) :సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణహోత్సవాలలో భాగమైన చేపట్టే రథోత్సవానికి ఆర్ అండ్ బీ కార్యనిర్వాహక ఇంజనీర్ విద్యాసాగర్ రథం పటిష్టంగా ఉందని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈనెల 8వ తేదీ రాత్రి 9గంటలకు రథసారథి కదిరి లక్ష్మణరావు బృందం ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. నిబంధనల మేరకు ఆర్అండ్‌బీ ఇంజనీరు రథాన్ని పరిశీలించి ధ్రువపరచాల్సి ఉంది. ఈ మేర కు గురువారం రథ చక్రాలను, ఇరుసులను, జాకీ, స్టీరింగ్ వీల్ సాంకేతికంగా పరిశీలించి అనుమతి ఇచ్చారు. ఆయన వెంట దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈలు నాగేశ్వరరావు, సూరిబాబు, ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు, ఏఈ పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వీరంతా సింహాద్రినాథుని దర్శించుకున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న హనుమాన్ శోభాయాత్ర జరుగనుంది. ఈ బైక్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఎంవీపీలోని తన స్వగృహంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు పాల్గొన్నారు.

ఆహ్లాదకర వాతావరణంలో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లు

వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్



ప్లాట్లు పొందినవారికి పత్రాలు అందిస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థం రాష్ట్రప్రభుత్వం వివిధ ప్రాంతాల్లో ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేస్తోందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా అడ్డూరులో 19.99 ఎకరాల్లో 146 ప్లాట్లు, విజయనగరం జిల్లా గరివిడిలో 21.30 ఎకరాల్లో 212 ప్లాట్లు, విశాఖ జిల్లా పాలవలసలో 76.96 ఎకరాల్లో 472 ప్లాట్లు వీఎంఆర్డీఏ అభివృద్ధి చేస్తోందని తెలిపారు. మురుగునీరు శుద్ధి చేసే వ్యవస్థ, భూగర్భ డ్రైనేజీ, బీటీ రోడ్లు, సీసీ రహదారులు, తాగునీటి సదుపాయం, పార్కులు వంటి సౌకర్యాలు వీటిలో కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రతి లే అవుట్‌లోను 10 శాతం ప్లాట్లు ప్రభుత్వం ఉద్యోగులకు, 5 శాతం ప్రభుత్వ పెన్షనర్లకు కేటాయించడం జరుగుతుందని, వీటి ధరలో పది శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో గురువారం వివిధ లేఅవుట్‌లలోని ప్లాట్లలను లాటరీ ద్వారా కేటాయించారు. 113 మంది దరఖాస్తుదారులకు ప్లాట్లు కేటాయించారు. ఆసక్తి గల వారు ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని వారు కోరారు.

జీవీఎంసీ భవన సముదాయానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

మద్దిలపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో నిర్మించనున్న జీవీఎంసీ నూతన భవవ సముదాయానికి గురువారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రూ.1.68 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థలకు చేరుకోవడంతో కొత్త భవనం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పట్టణ ఆరోగ్యం కేంద్రం, షాపింగ్ కాంప్లెక్స్‌లకు ఈ భవనం వినియోగిస్తారని చెప్పారు. కాగా, ప్రస్తుతం ఉన్న పాత భవనంలో మూడు సచివాలయాలు, పోస్టాఫీస్, వార్డు కార్యాలయం, కిరణాదుకాణాలు నిర్వహించేవారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పాత భవనంలో స్థానంలో కొత్త భవన నిర్మాణం చేపట్టనున్నారు.

కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్, టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, దువ్విస్వామి, ఒమ్మి అప్పారావు, ప్రసాద్, డొక్కర శ్రీను, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు

విశాఖపట్నం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించిన రూ. 3.89 లక్షల విలువైన చెక్కులను గంటా శ్రీనివాసరావు గురువారం సంబంధిత వ్యక్తులకు అందజేశారు. ఎంవీపీ కాలనీలో ఆయన స్వగృహంలో వీటిని పంపిణీ చేశారు. జీవీఎంసీ 8వ వార్డుకు చెందిన మురళికి రూ. 2.91 ల చెక్కు, భీమిలి మండలం టినగరపాలేనికి చెందిన తేజ్‌తన్వేష్‌కు రూ.49 వేల చెక్కు, 3వ వార్డుకు చెందిన వియ్యపు రఘునాథ్‌కు రూ.49 వేలు చెక్కు అందజేశారు.

ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు గార్మెంట్ మేకింగ్, మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

ఆరిలోవ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ పాత పోలీసుస్టేషన్ సమీపంలో గల ఉర్వి విక్రమ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు గార్మెంట్ మేకింగ్, ఆర్యావర్క్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీలో ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. గత 30 ఏళ్లుగా మహిళలు, కౌమార బాలికల కోసం పని చేస్తున్న ఉర్వి విక్రమ్ చారిటబుల ట్రస్టు ఆధ్వర్యంలో ఈ శిక్షణలు అందిస్తున్నట్లు తెలిపారు ఈ శిక్షణ ఏప్రిల్ 7 నుంచి శిక్షణ తరగతులు ఉంటాయని సంస్థ కో-ఆర్డి నేటర్ హరి వెంకటరమణ తెలిపారు. ఆరిలోవ పాత పోలీసు స్టేషన్ సమీపంలో గల సంస్థ కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణకు వయో పరిమితి లేదని తెలిపారు.

భర్త ఆచూకీ కోసం పోలీసులకు ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అత్తవారింటి నుంచి వెళ్లిన వ్యక్తి ఫోన్ కాల్‌కు అందుబాటులో లేకపోవడంతో ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పిఠాపురం కాలనీలో తన తల్లిదండ్రులతో ఉంటున్న యడ్లపల్లి దేదీప్యకు 2017లో యశ్వంత్ కుమార్‌తో వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. భర్తతో విభేదాల కారణంగా దేదీప్య కొద్ది కాలంగా తన తల్లిదండ్రులతో ఉంటోంది. ఉగాది పండుగ నేపథ్యంలో యశ్వంత్.. దేదీప్య ఇంటికి వచ్చాడు. తిరిగి 31న హైదరాబాద్ వెళ్లిపోతున్నట్టు చెప్పాడు. అయితే ఆ తర్వాత ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆమె యశ్వంత్ తల్లిదండ్రులను వాకబు చేసింది. తమ వద్దకు రాలేదని చెప్పారు. ఇదే సమయంలో ఒక ఫోన్ నెంబరు నుంచి మహిళ దేదీప్యకు ఫోన్ చేసి, నీ భర్తతో పదేళ్లుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నట్టు పేర్కొంది. దీంతో ఏం జరిగిందో తెలియక పోలీసులను ఆశ్రయించడంతో సీఐ మురళీ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉచితంగా పాలీసెట్ శిక్షణ తరగతులు



విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ కె.నారాయణరావు

కంచరపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా పాలీసెట్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. రాష్ట్ర సాంకేతిక శాఖ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు శిక్షణ తరగతులకు హాజరు కావచ్చు. సుమారు 200 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు గురువారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఈ నెల 30న జరుగుతుంది. ఏప్రిల్ 15 వరకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలియజేశారు.

స్వచ్ఛ సర్వేలో ఉత్తమ ర్యాంకుకు కృషి చేయండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న జోన్-4 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు

అల్లిపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించి, జీవీఎంసీకి మంచి ర్యాంకు వచ్చేందుకు బాధ్యతతో పనిచేయాలని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయడుసచివాలయ కార్యదర్శులకు సూచించారు.గురువారం 33వ వార్డు వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో సచివాలయాల సిబ్బంది, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ప్రజలను స్వయంగా కలసి వారి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ఆర్ఐ .సీతారామయ్య పాల్గొన్నారు.

దుర్గాపురంలో విద్యుత్ సరఫరా నేడు నిలిపివేత

మాధవధార, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఎన్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్ఏడీ కొత్తరోడ్డు సాకేతపురం దగ్గర నివాసిత ప్రాంతం దుర్గాపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ బి.కె.నాయుడు తెలిపారు.

బార్ కౌన్సిల్ నూతన అధ్యక్షుడికి అభినందన



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి అప్పన్నరెడ్డి

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బార్ కౌన్సిల్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.కె.శ్రీనివాస్‌ను జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి, రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి బి.అప్పన్నరెడ్డి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అప్పన్నరెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ తండ్రి ఎం.కె.సీతారామయ్య బార్ కౌన్సిల్ అధ్యక్షునిగా, జిల్లా బాక్సింగ్ సంఘం అధ్యక్షునిగా సేవలందించారని, ఆయన బాటలో శ్రీనివాస్ కూడా సేవలందించాలని ఆకాంక్షించారు.

సంకీర్తనాచార్యునికి సత్కారం



వెంకటపతి స్వామిని సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య వాగ్గేయకారుడు, జగత్కళాపీఠ అధిపతి కె.వెంకటపతి స్వామికి గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో పదవీ విరమణ సత్కారం జరిగింది. సహృదయ సాహితి, జగత్కళాపీఠం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వెంకటపతి స్వామి రచించిన కీర్తనలను ద్వారం త్యాగరాజు శిష్యురాలు అక్కినపల్లి లక్ష్మీ శైలజ శ్రావ్యంగా ఆలపించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ రాజయోగి వెంకటపతి స్వామి ఆధ్యాత్మిక కృషి కొనసాగాలని ఆకాంక్షించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు వెంకటపతి స్వామిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.జి.వేణు, డాక్టర్ మరడాన సుబ్బారావు, డాక్టర్ సూరపనేని విజయకుమార్, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, సీహెచ్ చిన సూర్యనారాయణ, ముప్వ నాగరాజు శర్మ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం ప్రాంతంలో ఆకతాయిల హల్‌చల్!

» మద్యం, గంజాయి తాగుతూ అర్ధరాత్రి వరకు న్యూసెన్స్ » పోలీస్ నిఘా లేక మితిమీరుతున్న ఆగడాలు » స్థానికులు బెంబేలు

కంచరపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో ఆకతాయిలు, మందుబాబులు హల్‌చల్ చేస్తుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఏ వీధిలో చూసినా పది నుంచి ఇరవై మంది వరకు కుర్రాళ్లు గుంపులుగా సెల్‌ఫోన్లు చూస్తూ బాటసారులను కామెంట్ చేస్తున్నారు.



ఓ ఇంటి ముందు పగులగొట్టిన పూలకుండీలు

రెడ్డికంచరపాలెం ఆర్చ్ దగ్గర నుంచి స్థానిక అమ్మ రెసిడెన్సీ వరకు, తోట వీధి, గొల్లకంచరపాలెం, వివేకానంద వీధి ప్రాంతాల్లో వీరి ఆగడాలకు అంతులేకుండా పోతుంది. గంటల తరబడి ఫోన్లతో ఆడుతూ అటుగా రాకపోకలు సాగించే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు వాపోతున్నారు. కొందరు యువకులు రోడ్డు మీదే మద్యం, గంజాయి తాగుతూ స్థానికులు, మహిళలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మహిళలు ఒంటరిగా వెళ్లడానికి సాహసించడం లేదంటే ఆకతాయి చేష్టలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చని స్థానికులు విరుచుకుపడుతున్నారు. జీవీఎంసీ 56వ వార్డు పరిధి తోటవీధిలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను తగలబెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. పక్కనే ఉన్న మరో మూడు బైక్‌లు పాక్షికంగా కాలిపోయాయి. అదే విధంగా మరో ఇంటి ముందు ఉన్న పూల కుండీలను ధ్వంసం చేశారు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కొందరు ఉద్దేశపూర్వకంగా వీధి దీపాలు ఆపేయడం, వాహనాల్లోని పెట్రోల్ దొంగిలించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి రెడ్డికంచరపాలెం ఆర్చ్ నుంచి అమ్మ రెసిడెన్సీ వరకు నెలకుని ఉంది. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉంటుందని స్థానికులు అంటున్నారు.



తోటవీధిలో ఆకతాయిల దాడిలో దగ్ధమైన బైక్

నవమి వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు

మురళీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకల నిర్వహణకు మురళీనగర్ ప్రాంతంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మాధవధార మాధవ యువజన సమాజం నిర్వహణలో గల పురాతన రామాలయంలో కమిటీ సభ్యులు చలువ పందిళ్లు, క్యూలైన్లు కడుతున్నారు. మాధవధార ఉడాకాలనీ లక్ష్మీ గణపతి ఆలయంలోనూ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నవమి పూజలకు అంకురార్పణగా శుక్రవారం సీతారాముల పెళ్లి రాట వేస్తారు. 5న పంచామృతాభిషేకం, అర్చనలు ఉంటాయి. నవమి రోజున (ఆదివారం) ఉదయం నుంచి మంగళ ధ్వని, నిత్యాభిషేకం తర్వాత 9 గంటలకు సీతారాముల ఉత్సవమూర్తుల శోభాయాత్ర, పట్టు వస్త్రాలతో అలంకరణ చేపడతారు. 11 గంటల 51 నిమిషాల శుభ ముహూర్తంలో సీతారాముల కల్యాణ వేడుకలు జరుగుతాయి. ఆలయ ఆవరణలో భక్తులకు విందు భోజనాలు, సాయంత్రం శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.



మాధవధార ఆలయంలో సీతారామలక్ష్మణులు

అంబికా బాగ్‌లో 6న సీతారాముల కల్యాణం



శ్రీరామ నవమి వేడుకల నిర్వహణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

మహారాణిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అంబికాబాగ్‌లో సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవాలు 6న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారిణి కె.శోభారాణి తెలిపారు. శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణపై గురువారం అంబికాబాగ్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం 5 గంటలకు స్వామికి పంచామృతాభిషేకంతో పూజాది కార్యక్రమాలు ప్రారంభించి, 7న పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తామన్నారు. స్వామి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు విరాళంగా ఇచ్చేవారి కోసం కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. వేడుకలకు సంబంధించిన బ్రోచర్‌ను అధికారులు ఆవిష్కరించారు. సహాయ కార్యనిర్వాహక అధికారి కె.తిరుమలేశ్వరరావు, ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

మహిళలపై నేరాల కట్టడికి ప్రత్యేక పోలీసు స్టేషన్

ఐద్వా ప్రతినిధుల డిమాండ్

మహారాణిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని ఐద్వా మహిళా సమాఖ్య డిమాండ్ చేసింది. గురువారం కేజీహెచ్ మార్చురీ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పి.మణి మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని హోంమంత్రి అనిత పరామర్శించి, తక్షణమే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మధురవాడ ప్రాంతంలో నేరాల సంఖ్య పెరుగుతున్నందున అదనంగా పోలీసు స్టేషన్, మహిళల రక్షణ నిమిత్తం ప్రతి ఏసీపీ పరిధిలో మహిళా పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ హయాంలోనూ గంజాయి, మద్యం విచ్చలవిడిగా లభిస్తుండడంతో మహిళలపై దాడులు, పిల్లలపై అత్యాచారాలు పెరిగాయని, దారుణ ఘటనలు మరువకముందే ఇంకోచోట భయోత్పాత సంఘటనలు వెలుగు చూడడం భయాందోళన కలిగిస్తోందన్నారు. సమావేశంలో నాయకులు ఎండీ బేగం, దేవుడమ్మ, పుష్ప, సుజాత, కొండమ్మ, సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, ఆర్‌కేఎస్వీ కుమార్, ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కేజీహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న ఐద్వా ప్రతినిధులు

బాటసారులకు బాసటగా..

అక్కయ్యపాలెం/మురళీనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారి బస్టాప్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం జీవీఎంసీ అదనపు కమిషనర్ సోమన్నారాయణ ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. గ్రేటర్ 50వ వార్డులో హేమ అడోబ్స్ నిర్మాణ సంస్థ మజ్జిగ చలివేంద్రం ప్రారంభించింది. సంస్థ నిర్వాహకులు బొచ్చ సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని హైవే రోడ్డులో దీన్ని ఏర్పాటు చేశారు. వేసవి సీజన్ మొత్తం కొనసాగిస్తామని సురేష్ తెలిపారు. ప్రయాణికులు, స్థానికులకు ఎండల్లో ఉపశమనం కలిగేలా మజ్జిగ అందజేశారు. వేసవి రెండు నెలలు సాధారణ మంచినీటి చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు.



బిర్లా జంక్షన్ హైవే రోడ్డులో ప్రయాణికులకు పానీయాలు



అక్కయ్యపాలెం బస్టాప్ వద్ద మజ్జిగ అందిస్తున్న ఏడీసీ సోమన్నారాయణ

మలయవాసిని మధురగానం

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లలితా పీఠంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రుల రామాయణ ప్రవచనాల్లో భాగంగా కుశలవుల పాటలపై గురువారం ఆచార్య కోలవెన్ను మలయవాసిని భావ సందేశమిచ్చారు. శ్రీరాముడి సీతాపరిత్యాగం కారణంగా జానపదులు శూర్పణఖ మాయను చిత్రించారని చెప్పారు. వాల్మీకి రామాయణంలో సీతను రాముడు విడిచిపెట్టడమే ఉంది.. కానీ స్త్రీల పాటల్లో రాముడు శూర్పణఖను సంహరించమని లక్ష్మణుడ్ని ఆజ్ఞాపించినట్లు ఉందని ప్రస్తావించారు. ఊర్మిళ తదితర వారి భావాలకు సంబంధించిన పాటలను గానం చేశారు. కుశలవుల రామకథాగాన విశేషాలను మలయవాసిని వివరించారు. కుశలవులు పాడినట్లుగా పేర్కొంటున్న నాలుగు పెద్ద పాటలను మలయవాసిని మధురంగా గానం చేశారు. అనంతరం ఆమెను పీఠం కార్యనిర్వహణాధికారి మన్నవ కృష్ణసేన్ సత్కరించారు. ఈ సభలో డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ కనకమహాలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.



ప్రవచనం వినిపిస్తున్న మలయవాసిని

వ్యాధుల వివరాలు నమోదు చేయండి



చార్టులు అందజేస్తున్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జగదీశ్వరరావు

సీతమ్మధార, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రకాల వైద్య ఆరోగ్య కేంద్రాలు, ల్యాబ్ టెక్నీషియన్లు మలేరియా, డెంగ్యూ సంబంధిత రిజిస్టర్లు, చార్టులు పూర్తిస్థాయిలో నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లాలోని అన్ని ల్యాబ్‌లకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన మలేరియా, డెంగ్యూ రిజిస్టర్లు, చార్టులను గురువారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం వాటిని ల్యాబ్ టెక్నీషియన్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 73 పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వీటిని అందజేశామని, ప్రతి నెలా మలేరియా, డెంగ్యూ గణాంకాలు నమోదు చేసి దిన, వార, మాస, వార్షిక నివేదికలు సక్రమంగా తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ చిత్రాడ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

యూఎఫ్‌యూ టీ20 క్రికెట్ నాకౌట్ టోర్నీ ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం నేతృత్వంలో యూఎఫ్‌యూ నిర్వహిస్తున్న చిన్నరాజు, రామరాజు స్మారక టీ 20 క్రికెట్ నాకౌట్ టోర్నీ గురువారం ప్రారంభమైంది. వీడీసీఏ-బి గ్రౌండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీకి ఏసీఏ వీడీసీఏ స్టేడియం నిర్వాహక ఇన్‌చార్జి జెకెఎం.రాజు, అడ్మినిస్ట్రేటర్ రమేష్ బాబు, సీనియర్ అంపైర్ ఎస్.జోగారావు ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను ప్రారంభించారు. టోర్నీ నిర్వాహక కార్యదర్శి డేవిడ్ సునీల్, తేజ, మూర్తి, అఖిల్, బుర్రయ్య తదితరులు పాల్గొన్నారు. వీడీసీఏ-బి గ్రౌండ్‌తోపాటు హిందుస్తాన్ జింక్ గ్రౌండ్‌లో తొలిరోజు జరిగిన మ్యాచ్‌ల్లో గౌరి యూత్, ఉషోదయ సిసి, పెంటమాంబ సిసి, శారద సిసి జట్లు గెలుపొందాయి.

వీడీసీఏ-బి గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో గౌరి యూత్ సిసి ఏడు వికెట్ల తేడాతో మూన్ స్టార్ సిసిపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన మూన్‌స్టార్ 18.5 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌట్ కాగా, గౌరి యూత్ సిసి 14.5 ఓవర్లలో మూడు వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని ఛేదించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ఉషోదయ సిసి 12 పరుగుల తేడాతో ప్రొఫెషనల్ సిసిపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఉషోదయ సిసి నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 164 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో ప్రొఫెషనల్ సిసి 19.1 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. జింక్‌గ్రౌండ్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో పెంటమాంబ సిసి ఏడు వికెట్ల తేడాతో కెంట్ సిసిపై గెలుపొందగా, మరో మ్యాచ్‌లో శారద సిసి 53 పరుగుల భారీ తేడాతో కెంట్ సిసిపై ఘన విజయం సాధించింది.



టాస్ వేస్తున్న అతిథులు జె.కె.ఎం.రాజు, రమేష్, జోగారావు

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

... 5వ పేజీ తరువాయి

అన్నిచోట్ల స్లాట్ బుకింగ్ కిందకు తీసుకువస్తారు.

సర్వర్ తట్టుకుంటుందా?

రిజిస్ట్రేషన్ల శాఖకు సర్వర్ సమస్య ఉంది. ఇది ఆకస్మికంగా మొండికేస్తుంది. ఆధార్ డేటా అప్‌డేట్ కాదు. డాక్యుమెంట్లు అప్‌లోడ్ కావు. ఇటువంటి పరిస్థితి వస్తే... స్లాట్ బుకింగ్ చేసుకున్న వారిని పని ఆ పది నిమిషాల్లో పూర్తి కాదు. అలాంటి వారు మళ్లీ రావాలనుకుంటే స్లాట్ రీ షెడ్యూల్ చేసుకోవలసి ఉంటుంది. దీనికి రూ.200 ఫీజు చెల్లించాలి. ప్రభుత్వం వల్ల జరిగిన జాప్యానికి తాము ఎందుకు ఫీజు కట్టాలని చాలామంది ప్రశ్నించే అవకాశం ఉంది. పైగా పది నిమిషాల్లో పూర్తవుతుందని హామీ ఇచ్చి, పని పూర్తి చేయకుండా వెనక్కి పంపించారనే విమర్శలు వస్తాయి. ఈ నేపథ్యంలో సర్వర సామర్థ్యం పెంచాల్సిన అవసరం ఉంది.

15% వృద్ధి లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

శాఖలకు లక్ష్యాలు నిర్దేశించామని వివరించారు. తగరపువలసలో ఆయిల్, ఎంవీపీ కాలనీలో ప్రింటింగ్, గాజువాకలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్లు ఏర్పాటుచేస్తామన్నారు. సేవా రంగంలో ప్రధానంగా పర్యాటక, ఐటీ, ఆతిథ్య రంగాలపై ఫోకస్ పెట్టామన్నారు. ఈ ఏడాది ఆగస్టుకల్లా టీసీఎస్ కార్యకలాపాలు ప్రారంభించనున్నదని కలెక్టర్ చెప్పారు. ఐటీ హిల్స్‌లో ప్రస్తుతం ఉన్న సెజ్‌ను డీనోటిఫై చేయడానికి కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లాయన్నారు. స్టార్టప్‌లు, ఇన్నోవేషన్ హబ్‌లను ప్రోత్సహిస్తామన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు విశాఖ నుంచి భీమిలి వరకూ బీచ్ రోడ్డులో మూడు డబుల్ డెక్కర్ బస్సులు నడపనున్నట్టు చెప్పారు. దీనికి సంబంధించి ప్యాకేజీ ఖరారు చేస్తామన్నారు. విజన్ డాక్యుమెంట్‌లో ఏఏ శాఖలు ఏమేం చేయాలన్నది నిర్దేశించామని, ప్రభుత్వం ఫెసిలిటేటర్‌గా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

సీపీ ఆదేశాలు బేఖాతరు

... 5వ పేజీ తరువాయి

మెయిన్‌రోడ్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్డుపై దుకాణాలు పెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని సీపీ గమనించారు. ఆక్రమణలు తొలగించాలని, రోడ్డుపై దుకాణాలు ఉండడానికి వీల్లేదని సిబ్బందిని ఆదేశించారు. అయితే సీపీ ఆదేశాల మేరకు ఆక్రమణలను తొలగించే ప్రయత్నం సిబ్బంది చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. దుర్గాలమ్మ గుడి వరకూ నడుచుకుంటూ వెళ్లిన సీపీ రోడ్డుపై దుకాణాలు తొలగించాలని చెబితే పట్టించుకోరా?...అని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఒకటి, రెండు చోట్ల మాత్రమే ఆక్రమణలను ట్రాఫిక్ సిబ్బంది తొలగించారు. సీపీ వెళ్లిపోగానే తొలగించిన దుకాణాలను తిరిగి రోడ్డుపై ఏర్పాటుచేసుకున్నా అక్కడే ఉన్న పోలీసులు గానీ, జీవీఎంసీ జోనల్ కమిషనర్‌గానీ అభ్యంతరం చెప్పకపోవడం ఆశ్చర్యపరిచింది. పోలీస్, జీవీఎంసీ అధికారులను ఆశీలు వేలం కాంట్రాక్టు దక్కించుకున్న కూటమి చోటా నేత ప్రసన్నం చేసుకున్నారని, అందుకే ఆయనకు సహకరిస్తున్నారని వ్యాపారులు భావిస్తున్నారు.

16 నుంచి స్టీల్‌ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

... 5వ పేజీ తరువాయి

పేర్కొన్నారు. ప్లాంటులో గురువారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కార్మికులపై యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ తరుణంలో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 16 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఏ ఒక్క కార్మికుడినీ తొలగించబోమని యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నమ్మి రమణ, సోమరాజు, కె.వంశీ, అప్పారావు, భాస్కరరావు, ఆనంద్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మెడికిల్ స్టోర్స్

... 5వ పేజీ తరువాయి

విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఆయా దుకాణాలపై 15 నుంచి 30 రోజుల సస్పెన్షన్ విధించారు.

కానరాని ప్రిస్క్రిప్షన్ రిజిస్టర్లు

మెడికల్ స్టోర్స్‌లో విక్రయించే మందులకు సంబంధించి ప్రిస్క్రిప్షన్ రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలి. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో రిజిస్టర్ అయిన వైద్యుడి ప్రిస్క్రిప్షన్ మేరకు మాత్రమే మందులను విక్రయించాలి. వాటిని ఎవరికి విక్రయించినదీ, వైద్యుడి ప్రిస్క్రిప్షన్ వివరాలతో తప్పనిసరిగా మెడికల్ స్టోర్స్ నిర్వాహకులు రిజిస్టర్ నిర్వహించి భద్రపరచాలి. హోల్ సేలర్స్ వద్ద ఎన్ని మందులు కొనుగోలు చేసిందీ, ఎంతకు విక్రయించిందీ, మిగిలిన సరకు వివరాల రికార్డులను నిర్వహించాలని చట్టం చెబుతోంది. అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఆరు మెడికల్ స్టోర్స్‌లో ఈ రికార్డులు లేవని తేలింది. కొన్నిచోట్ల రికార్డులున్నప్పటికీ పూర్తిస్థాయిలో వివరాలు కనిపించలేదు.

అదుపులేని మత్తు మందుల విక్రయాలు

కొన్ని మెడికల్ స్టోర్స్‌లో మత్తు కలిగించే ఇంజక్షన్లు, మాత్రలు భారీగా విక్రయిస్తున్నారు. వీటిని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి తెస్తున్నట్టు చెబుతున్నారు.

కనిపించని పర్యవేక్షణ

ఔషధ నియంత్రణ విభాగం అధికారులు నిరంతరం తనిఖీలు చేస్తూ మెడికల్ స్టోర్స్‌ను పర్యవేక్షించాలి. అటువంటిదేమీ నిర్వాహకులు ఇష్టం వచ్చినట్టుగా మందుల విక్రయాలు సాగిస్తున్నారు. గడువు ముగిసిన మందులను వినియోగించడంతో తీవ్ర దుష్పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. నగర పరిధిలో 3 వేలు, అనకాపల్లి జిల్లాలో 1,100, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 300 మెడికల్ స్టోర్స్ ఉన్నాయి. వీటిని పర్యవేక్షించేందుకు విశాఖ జిల్లాలో ముగ్గురు, అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు మరో ముగ్గురు మాత్రమే డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరంతా ప్రతినెలా 40 వరకు దుకాణాలను తనిఖీ చేయాలి. ఒకరిద్దరు మినహా తూతూమంత్రంగా పనిచేస్తున్నారనే విమర్శలున్నాయి. వీరిని కో-ఆర్డినేట్ చేయాల్సిన జిల్లాస్థాయి అధికారి పట్టనట్టు వ్యవహరిస్తుండడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని చెబుతున్నారు. ఈ విభాగం పనితీరుపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

స్టార్ హోటళ్లకు శుభవార్త

... 5వ పేజీ తరువాయి

చేస్తుందని ఏపీ టూరిజం ఫోరం కార్యదర్శి పవన్ కార్తీక్ అన్నారు. దీనివల్ల కార్పొరేట్, సోషల్ ఈవెంట్ల సంఖ్య పెరుగుతుందని, పర్యాటకుల సంఖ్య కూడా అధికం అవుతుందన్నారు. వ్యాపార అభివృద్ధికి అండగా నిలిచినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు.

మానవ సేవకు ఇదో తోవ!

నగరంలో సంచరిస్తూ అనాథలకు సేవ చేస్తున్న క్షురకుడు

మహారాణిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సంకల్పం ఉండాలే గాని డబ్బుతో పని లేకుండా ఏదో ఒక రూపంలో మానవసేవ చేయొచ్చని నిరూపిస్తున్నాడు పట్నాల చిన్నారావు. తన చేతి వృత్తితోనే అనాథలు, వృద్ధులు, నిరాశ్రయులకు ఉచితంగా క్షవరం చేసి, కొందరికి స్నానం చేయిస్తూ, తన సంతృప్తిని వెతుక్కున్నాడు.

పట్నాన చిన్నారావు ఇరవై ఏళ్ల క్రితం పార్వతీపురం మన్యం జిల్లా మార్కొండపుట్టి గ్రామం నుంచి పొట్టకూటి కోసం తన అన్న గంగరాజుతో కలసి వచ్చాడు. తమకు తెలిసిన క్షురక వృత్తి చేపట్టారు. ముందుగా అన్నదమ్ములు ఫుట్‌పాత్‌పై క్షవరం చేస్తూ పనిలో నైపుణ్యత కనబరిచి అంచెలంచెలుగా ఎదిగారు. మహారాణిపేటలోని రామ్‌నగర్‌లో సెలూన్ షాపు ఏర్పాటు చేసుకున్నారు. ఆ తరువాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. తమ చేతి వృత్తి నైపుణ్యంతో పదుగురినీ ఆకట్టుకుంటూ జీవితంలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో తనకు ఏదైనా సేవ చేయాలని చిన్నారావుకు అనిపించింది. రోడ్లపై అనాథలు, వృద్ధులు, మానసిక వికలాంగులు ఒంటరిగా, అపరిశుభ్రతతో ఉండడం గమనించాడు. ప్రతి మంగళవారం తన సెలూన్ షాపునకు సెలవు దినం కావటంతో ఆ రోజును మానవసేవ చేయాలని సంకల్పించాడు. కేజీహెచ్, బీచ్‌రోడ్డు, జగదాంబ జంక్షన్, వన్‌టౌన్, రామ్‌నగర్, వాల్తేర్, రైల్వేస్టేషన్, బస్‌కాంప్లెక్సుతోపాటు అనాథాశ్రమాలకు వెళ్లి రోడ్లపై సంచరించే అనాథలు, వృద్ధులను చేరదీసి, వారికి నచ్చజెప్పి బాగా పెరిగిపోయిన వారి జుత్తును కత్తిరిస్తున్నాడు. చేతిపంపులు, వీధి కుళాయిల వద్ద వారికి స్నానం చేయిస్తున్నాడు. పొట్టకూటికి నగరానికి వచ్చాం.. స్థిరపడ్డాం... తమకు తోచిన సేవలు అందిస్తున్నామ"ని తెలిపాడు. చిన్నారావు అందిస్తున్న సేవలను పలువురు అభినందిస్తున్నారు.



ఓ అభాగ్యునికి క్షవరం చేశాక స్నానం చేయిస్తున్న పట్నాల చిన్నారావు



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

సీతారాముల విగ్రహావిష్కరణ

అగనంపూడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి బీసీ కాలనీలో గల రామాలయంలో గురువారం సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు గుంటూరు గణేశ్‌కుమార్, తులసీ దంపతుల ఆర్థిక సాయంతో ఈ విగ్రహాలను రూపొందించారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచామృతా భిషేకాలు నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలనే ప్రోత్సహిస్తాం

సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత



ఆస్పత్రిలో గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ సుజాత, తదితరులు

గోపాలపట్నం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలనే ప్రోత్సహిస్తామని గోపాలపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత అన్నారు. సిజేరియన్ వద్దు- సాధారణ ప్రసవాలే ముద్దు అనే అంశంపై ఇక్కడి ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుజాత మాట్లాడుతూ గర్భిణులందరూ వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ సరైన పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అలాగే వ్యాయామం, విశ్రాంతి తీసుకోవడం వల్ల సాధారణ ప్రసవాలు జరుగుతాయన్నారు. సాధారణ ప్రసవం అయ్యేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యులు సుజాత, నివేదిత, షబ్నమ్, ప్రవళ్లిక, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనం ప్రారంభం

అగనంపూడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ కొత్తపాలెంలో ఎమ్మాన్నార్ ఫార్మా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రూ.31 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మాసిటీ పునరావాస కాలనీల అభివృద్ధికి ఫార్మా పరిశ్రమలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, స్థానిక నాయకులు దుల్ల రామునాయుడు, కర్రి దోశేంద్ర, సోమశేఖర్, ప్రసాద్, గొల్లవిల్లి సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రాబిన్‌హుడ్ :** జగదాంబ, శ్రీ లీలామహల్, శ్రీకన్య, శ్రీవెంకటేశ్వర, గోకుల్, నరసింహ (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం) శ్రీకన్య (గాజువాక) అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **మ్యాడ్ :** జగదాంబ, కామేశ్వరి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం),
● **పెళ్ళికాని ప్రసాద్ :** శ్రీ వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), తాతా (తగరపువలస)
● **కోర్ట్ :** జగదాంబ, సంగం, మినీ మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఛావా:** శారద, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 16, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 26, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 30, బీరకాయలు 44, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 22, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది)50, బరబాటి 26, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 120, బద్దచిక్కుడు 64, దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 22, క్యాప్సికమ్ 44, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42 చిలగడదుంపలు 36, కంద 60, గోరుచిక్కుడు 34, దేముడుచిక్కుడు 64, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 32, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 50, కర్రపెండలం 18, మామిడి అల్లం 64, బొప్పాయి 42, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	440
విజయనగరం	444
శ్రీకాకుళం	444

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	115
లైవ్ ధర	135
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

హౌస్ కమిటీ లబ్ధిదారులకు న్యాయం చేస్తాం

» జీవో-45 ప్రకారం ఇళ్ల పట్టాలివ్వడమే ప్రభుత్వ లక్ష్యం
» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు
» దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబరు 31 వరకు గడువు: జేసీ మయూర్ అశోక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హౌస్ కమిటీ పరిధిలో గల అరులైన లబ్ధిదారులందరికీ జీవో-45 ప్రకారం ఇళ్ల పట్టాలివ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని హౌస్ కమిటీ పరిధిలో గల ఇళ్లకు పట్టాలిచ్చేందుకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో-45పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను కొత్త గాజువాలో గురువారం ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గాజువాక ప్రాంతం హౌస్ కమిటీ పరిధిలో ఉండడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసి ఇళ్లకు పట్టాలివ్వడం జరిగిందన్నారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జీవో ఇచ్చి పట్టాలిచ్చినప్పటికీ ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. ప్రస్తుత తమ ప్రభుత్వం హౌస్ కమిటీ భూ లబ్ధిదారులందరికీ పట్టాలిచ్చి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలనే లక్ష్యంతో జీవో-45ను విడుదల చేసిందని పల్లా పేర్కొన్నారు.

ఇప్పటివరకు పట్టాలు పొందని వారందరూ తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకోకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల అత్యధికంగా ఇంటి పన్ను చెల్లించే పరిస్థితి నెలకొన్నందున అందరూ పట్టాలు పొందాలని సూచించారు. ఇప్పటివరకు పలు జీవోల ద్వారా నియోజకవర్గంలో వందలాది మందికి ఇళ్ల పట్టాలివ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గ పరిధిలో పూర్వం నుంచి గెడ్డపోరంబోకు ప్రాంతాల్లో ఇళ్లను నిర్మించుకుని ఎంతో మంది నివసిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనల పేరిట సంబంధిత ఇళ్లను క్రమబద్ధీకరించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని, దీనిపై సర్వే చేసి ముంపు సమస్య లేని ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు పట్టాలివ్వాలన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల నుంచి గాజువాక ప్రజలు ఎదుర్కొంటున్న హౌస్ కమిటీ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం జీవో-45ను విడుదల చేసి లబ్ధిదారులకు ఎంతో మేలు చేసిందన్నారు. దరఖాస్తు చేసుకునే గడువును కూడా ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబర్ 31 వరకూ పొడిగించిందన్నారు. అందువల్ల త్వరితగతిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే పట్టాలిచ్చేందుకు ఇబ్బంది ఉండదన్నారు. ఈ సభలో ఆర్డీవో శ్రీలేఖ, తహశీల్దార్ శ్రీవల్లి, బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణంరెడ్డి నరసింగరావు, జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, ప్రసాదుల శ్రీనివాస్, మహ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నేర రహిత నగరం కోసం యువత కృషి చేయాలి

» సీపీ శంఖబ్రత బాగ్చీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

గోపాలపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నేర రహిత విశాఖ నగరం కోసం యువత కృషి చేయాలని సీపీ శంఖబ్రత బాగ్చీ పిలుపునిచ్చారు. డ్రగ్స్ , సైబర్ నేరాల నియంత్రణ కోసం నవ సమాజ నిర్మాణం పేరిట నగరంలోని విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాన్ని స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు, డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తులు, కుటుంబాలతో పాటు సమాజానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. మాదకద్రవ్యాలు వినియోగించేవారు నేరస్థులుగా మారే ప్రమాదం ఉందని, తద్వారా సమాజంలో హింస, దాడులు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగించేవారు, విక్రయించేవారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని సూచించారు. డ్రగ్స్ వినియోగించేవారిని డ్రగ్ అడిక్షన్ సెంటర్‌కు తరలిస్తామని, అలాగే విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాదక ద్రవ్యాల రహిత విశాఖ నగరాన్ని తయారుచేసేందుకు, ఆన్‌లైన్, సైబర్ నేరాల కట్టడికి అందరూ సహకరించాలని కోరారు. సైబర్ నేరస్థుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ పృథ్వీతేజ, సీఐలు కల్యాణి, జి.అప్పారావు, ఎస్ఐ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ కె.మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అదీప్‌రాజ్, పరశురామ్, తదితరులు

పెందుర్తి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న నగరంలో జరగనున్న బైక్ యాత్ర, హనుమాన్ శోభాయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం సుజాతనగర్‌ల ఆవిష్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎన్ఎన్ పరుశరామ్ శోభాయాత్రను విజయవంతం చేసేందుకు గాను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా అదీప్‌రాజ్ చేతుల మీదుగా హనుమాన్ శోభయాత్ర గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, శోభయాత్ర కన్వీనర్ శివాజీరాజ్, దేవుడు పాల్గొన్నారు.

అగనంపూడి: హన్‌మాన్ విజయోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టనున్న బైక్ యాత్ర, హన్‌మాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని స్థానిక షిర్డీసాయి సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి కోరారు. గురువారం ఇక్కడి సాయిబాబా ఆలయం వద్ద ఆయన శోభాయాత్ర బ్యానర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు కోసూరి తాతారావు, నాయకులు ఉరిటి రవీంద్రకుమార్, వ్యాసశర్మ, రామారావు, రాజు, సత్యలక్ష్మి, సూరీడమ్మ, పవన్‌కుమార్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ అనుపోత్సవం



అగనంపూడిలో పూజలందుకున్న దుర్గమాంబ | ఉక్కు నిర్వాసిత కాలనీల ఆరాధ్య దేవత పెంటమాంబ

అగనంపూడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ అనుపోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున దుర్గమాంబను శోభాయమానంగా అలంకరించి పూజలు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచే భక్తులు ఆలయం వద్ద బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించి తిరిగి ఆలయం వద్దకు తీసుకువచ్చి అనుపోత్సవాన్ని జరిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, ప్రతినిధులు కనకరాజు, గల్లా రాజు, జి.శ్రీను, కె.సత్యారావు, కె.పైడిరాజు, జగదీశ్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెంటమాంబ వార్షికోత్సవాలు

పెదగంట్యాడ: ఉక్కు నిర్వాసిత కాలనీల ఆరాధ్య దైవం శ్రీపెంటమాంబ వార్షికోత్సవాలను శుక్రవారం నుంచి వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా గురువారం తొలి ఘటాల పూజలు జరిపారు. 14వ తేదీ వరకు ఘటాలను పురవీధుల్లో ఊరేగిస్తారు. మహాశక్తి అమ్మవారికి, భూలోకమాంబ, కుంచుమాంబ, దుర్గమాంబ, శక్తిమాంబ, మరిడిమాంబ, ఇలా రోజుకొక అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 14వ తేదీన అమ్మవారికి భారీ ఊరేగింపు, పరస జరుపుతామని ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన పోస్టరును ఆలయ ఆవరణలో సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు గొందేశి మహేశ్వర రెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, అప్పలరెడ్డి, శ్రీనివాసరావు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠ ఉత్సవాలు

పెందుర్తి-రూరల్: జీవీఎంసీ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెంలో నూకాంబిక ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ 'పెందుర్తి' ఇన్‌చార్జి గండి బాబ్జీ, కార్పొరేటర్ ముమ్మన దేముడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రోమాల శ్రీను, పి.చినబాబు, సన్ని, నూకరాజు, ఎర్నిబాబు, అప్పలరాజు, భవానీ, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు అభిషేకాలు

వేపగుంట: వేపగుంట, పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవం శ్రీముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక జలాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. జలాభిషేకంలో పాల్గొనేందుకు తెల్లవారుజాము 5 గంటల నుంచే ఆలయం వద్ద భక్తులు బారులుతీరారు. అర్చకులు శేషాద్రిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు జరిపారు.



స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో ట్రాఫిక్ మేనేజర్‌కు వినతిని అందజేస్తున్న తిరుమలనగర్ కాలనీ వాసులు

ఆర్టీసీ బస్ సదుపాయం కల్పించాలని వినతి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి నుంచి కళింగవీధి రామాలయం కూడలి వరకు ఆర్టీసీ బస్ సదుపాయం కల్పించాలని కోరుతూ తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం స్టీల్ సిటీ ఆర్టీసీ ట్రాఫిక్ మేనేజర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. వార్డులో సుమారు పాతిక వేల జనాభా ఉన్నారనీ, ఉదయం సాయంత్రం వేళల్లో ఎంతోమంది ఉద్యోగులు, కార్మికులు, కాలేజీలు, పాఠశాలలు విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, పూర్ణామార్కెట్‌కు వెళ్లే బస్సులను వడ్లపూడి మీదుగా నడిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు బి.నాగభూషణం, జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, రాజు, తదితరులు ఉన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, ఉపాధ్యాయులు

'నాసా' పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

ఎన్.ఎ.డి.జంక్షన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నాసా రీసెర్చి విభాగంలో అయాన్ ప్రాజెక్టులో భాగంగా నిర్వహించిన ప్రపంచ స్థాయి పోటీల్లో ఎన్ఏడీకి చెందిన నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎస్.ధనలక్ష్మి తెలిపారు. విద్యార్థులు ఈ ఘనత సాధించడం వెనక స్కూల్ యాజమాన్య ప్రోత్సాహం, ఉపాధ్యాయుల గైడెన్స్‌తో పాటు విద్యార్థుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తంగేటి బాల ఆదిత్య, ఆదిరెడ్డి నిహాల్ నాయుడు, ఎన్.జాయ్ చెర్రీ, ఇయ్యపు యువల్, ధనుశ్, ధవనేశ్వర్, కుశాల్ సాయి, యేగేంద్రలను యాజమాన్యప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం రాజ్ కుమార్, స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీరామ్ సరేశ్, శ్రీప్రతాప్, ఇన్‌చార్జి సుభాని, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

వేపగుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం విద్యుత్ ఫీడర్ పరిధిలో నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పాత అడవివరం, కుమ్మరిదిబ్బ, ధారపాలెం, వెంకటాపురం, ఎస్సీ, బీసీ కాలనీ, అజంత పార్కు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న వ్యాపారులు

కణితి రోడ్డులో చిరు వ్యాపారుల ఆందోళన

గాజువాక, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గత 30 ఏళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమను ఉన్నపళంగా తొలగించడాన్ని కణితి రోడ్డులో గురువారం చిరువ్యాపారులు ఆందోళనకు దిగారు. దశాబ్దాల తరబడి రోడ్డు పక్కన చిరు వ్యాపారకాలు చేసుకుంటు జీవనం సాగిస్తున్నామని, అయితే ఇటీవల కాలంలో తాము వ్యాపారాలు చేసుకోకుండా తొలగించడం సమంజసం కాదన ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది రాజకీయ నాయకులు తమ పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేసేంత వరకు పోరాటాలు చేస్తామని వారు పేర్కొన్నారు.

'స్వాతంత్ర్యాన్ని కాలరాస్తున్న పాలకులు'

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో 2014 నుంచి రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ ఇప్పుడు బుల్డోజర్ జస్టిస్ అమలు జరుగుతుందని సుప్రీంకోర్టు న్యాయవాది పొత్తూరి సురేశ్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ కేవీపీఎస్, ఏపీజీఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఉక్కునగరంలో నిర్వహించిన రాజ్యాంగాన్ని కాపాడుకుదాం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యాన్ని పాలకులు కాలరాస్తున్నారని, ప్రజల సమస్యలను పక్కన పెట్టి మతం గురించి, ఏ దుస్తులు వేసుకోవాలి, ఎలా ఉండాలి, ఏమి తినాలో కూడా చెబుతూ ఐక్యంగా జీవిస్తున్న ప్రజల మధ్య విఘాతాన్ని సృష్టిస్తున్నారన్నారు. సీఐటీయూ నాయకుడు ఎం.కృష్ణారావు, ప్రతినిధులు ఎస్.సత్యనారాయణ, గురుసింగ్, టి.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

ఎన్ఎంయూ కార్మికుల నిరసన

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి జి.సాయిరామ్ మాట్లాడుతూ అనకాపల్లిలో కార్మికుల భద్రత కోసం ఆర్టీసీ ఎండి సురేంద్రబాబు ఇచ్చిన సర్క్యులర్‌ను ఉల్లంఘించిన సిబ్బందిని అన్యాయంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎర్ర రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్నామన్నారు. ఆర్టీసీ యాజమాన్య వైఖరి మార్చుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎంఎస్ వాసు, బీఆర్ రావు, చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

'పల్లా'ను కలిసిన సీ ప్రతినిధులు

ఉక్కుటౌన్‌షిప్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం (సీ) ప్రతినిధులు, ఈపీఎఫ్-95 వారియర్స్ ప్రతినిధి బృందం గురువారం గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును పార్టీ కార్యాలయంలో కలిశారు. స్టీల్‌ప్లాంటులో పదవీ విరమణ చేసిన వారికి ఈపీఎఫ్-95 అధిక పింఛన్ పొందేందుకు కృషి చేసిన పల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను త్వరితగతిన పరిష్కారమయ్యేందుకు పల్లా చూపిన చొరవ మరువలేనిదన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీ అధ్యక్షుడు చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, పెన్షనర్ల ప్రతినిధులు డి.శ్రీనివాస్, జేపీ స్వామి, పి.వెంకటరావు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలంటూ వినతి

అగనంపూడి: అగనంపూడి ఉక్కు నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గురువారం స్థానిక నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. స్థానికంగా గ్రంథాలయం లేకపోవడంతో యువతతో పాటు సీనియర్ సిటిజన్లు ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఇక్కడి ఎన్టీఆర్ పార్కులో గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో స్థానికులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పల్లాను కలిసిన వారిలో నాయకులు కర్రి దోశేంద్ర, సత్యారావు, డొక్కా రమేశ్, బండారు చందూ రమేశ్, సత్యనారాయణ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

'గాజువాక' కార్యదర్శి కె.సత్యనారాయణ

పెదగంట్యాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సీపీఐ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కె.సత్యనారాయణ కోరారు. నియోజకవర్గ సీపీఐ సమితి సమావేశం గురువారం పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిరంతం పోరాటం చేసి వాటిని పరిష్కరించేందుకు గాను ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తేవాలన్నారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రభుత్వంపై పోరాడాలని, టిడ్కో గృహాలను అన్ని వసతులతో లబ్ధిదారులకు కేటాయించేలా చూడాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో నాయకులు టి.కనకరాజు జి.ఆనంద్, అచ్యుతరావు, విష్ణుమూర్తి, దుర్గారావు, కె.వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

కాకరలోవలో సీపీఐ శత జయంతి మహాసభలు

సింధియా: సీపీఐ శత జయంత్యుత్సవాల్లో భాగంగా 63వ వార్డు పరిధి కాకరలోవలో గురువారం మహాసభలు నిర్వహిచారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కాండ్రేంగుల సత్యాంజనేయ మాట్లాడుతూ ఈ నెల 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగే బహిరంగ సభలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనవలసిందిగా కోరారు. అనంతరం పార్టీ శ్రేణులకు హుండీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుడాల రాంబాబు, ఎన్.త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన



మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి అప్పికొండ కాలనీకి చెందిన పారిశుధ్య కార్మికురాలు గంగా భవానీ (45) బుధవారం విధులకు వెళ్లి కళ్లు తిరిగి పడిపోవడంతో సహచరులు తక్షణమే ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. దీంతో మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ అప్పికొండలో మృతదేహంతో కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు జీవీఎంసీ ఏఎంవోహెచ్ కిరణ్ కుమార్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు పడాల రమణ మృతురాలి కుటుంబ సభ్యులతో చర్చించారు. నష్టపరిహారంగా రూ.రెండున్నర లక్షలు, మృతురాలి కుమారుడికి ఉపాధి కల్పిస్తామని అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తరలించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు బందోబస్తు చర్యలు చేపట్టారు.

డీఎస్సీ అభ్యర్థులకు వరం

నిరుపేదలకు ఉచితంగా శిక్షణ

- ప్రభుత్వ ఆదేశాలతో వివిధ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో కోచింగ్
- వైసీపీ హయాంలో మూలనపడేసిన ప్రక్రియ
- కొద్దిరోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమశాఖల ఆధ్వర్యంలో వందలమందికి అవకాశం

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): **రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సుమారు 16 వేలకుపైగా పోస్టులను భర్తీచేయాలని నిర్ణయించిన నేపథ్యంలో అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించే ఏర్పాట్లు చేసింది. గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లలో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా మోసం చేసింది. ఎన్నికలకు ముందు హడావిడిగా ఆరువేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ ప్రక్రియను పూర్తి చేయలేకపోయింది. దీంతో ఎన్నికల సమయంలోనే మెగా డీఎస్సీ విడుదల చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. అంతేకాకుండా నిరుపేద అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో 16 వేలకుపైగా పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.**

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభమయ్యే సమయానికి ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా ప్రక్రియను పూర్తిచేస్తామని ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో కొద్దిరోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.


శిక్షణ శిబిరంలో డీఎస్సీ అభ్యర్థులు

ఉచిత శిక్షణకు ఆదేశాలు

డీఎస్సీకి సిద్ధమయ్యే నిరుపేద అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. నాలుగు నెలలు కిందట జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 85 మందికి శిక్షణ అందించింది. బీసీ స్టడీ సర్కిల్‌లో మూడు నెలల ఉచిత శిక్షణతోపాటు పుస్తకాల కోసం రూ.వెయ్యి, నెలకు రూ.1500 చొప్పున భృతి అందించింది. వీరి శిక్షణ పూర్తయింది. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మరో 100 మంది నిరుపేదలకు శిక్షణ ఇప్పించింది. తాజాగా ఎస్సీ, మైనారిటీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను తీసుకుంది. ఈ రెండు కేటగిరీల విద్యార్థులకు విశాఖలోని వినెక్స్ స్టడీ సెంటర్‌లో ప్రభుత్వం శిక్షణ ఇస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.26,500 చొప్పున మూడు నెలలకు ఖర్చు చేస్తోంది. ఉచిత శిక్షణ తో పాటు భోజనం, వసతి సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మెటీరియల్ అందించనున్నారు. గత నెల 23న శిక్షణ ప్రారంభమైంది. 90 రోజులపాటు కొనసాగుతుంది. ప్రస్తుతం ఈ కేంద్రంలో 292 మంది శిక్షణ పొందుతున్నారు. రెండో దశలో మరో 200 మంది ఎస్సీ అభ్యర్థులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. రెండో దశలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని రెండు సంస్థలకు ప్రభుత్వం శిక్షణ బాధ్యతలను అప్పగించినట్టు చెబుతున్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని 50 మంది విద్యార్థులకు ఇక్కడే శిక్షణ ఇస్తారు. దరఖాస్తు గడువుందని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



వందల మందికి మేలు..

డీఎస్సీ శిక్షణ ఖర్చుతో కూడిన వ్యవహారం. ప్రస్తుతం మూడు నెలలు శిక్షణకు కనీసం రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. మెటీరియల్‌కు మరో రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇప్పించే కార్యక్రమాన్ని చేపట్టడంతో వారందరికీ ఆర్థిక ఇబ్బందులను తప్పించినట్టు అయింది. శిక్షణకు ఎంపికైన వారిలో 99 శాతం మంది నిరుపేద కుటుంబాల వారే. దీంతో ఈ శిక్షణ మంచి అవకాశంగా చెబుతున్నారు.

సువర్ణావకాశం



డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం అభ్యర్థుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్ప విషయం. గత ఆరేళ్లుగా గదులు అద్దెకు తీసుకుని శిక్షణ తీసుకుంటున్నాం. ప్రభుత్వమే భోజనం, వసతి కల్పించి శిక్షణ ఇవ్వడం తుది దశలో ఎంతో మేలు చేకూరుస్తుంది. వినెక్స్‌లో ఫ్యాకల్టీ అనుభవం దోహదపడుతోంది.

- బి.నవీన్, డీఎస్సీ ఎస్టీటీ శిక్షణ అభ్యర్థి

ఏళ్లుగా నిరీక్షిస్తున్నా



డీఎస్సీ నోటిఫికేషన్ కోసం మూడేళ్లుగా చూస్తున్నాం. 2022 నుంచి శిక్షణలో ఉన్నా. ప్రస్తుతం ప్రభుత్వమే శిక్షణ ఇవ్వడం బాగుంది. ఇందు కోసం కనీసం రూ.20 వేలు ఖర్చవుతుంది. మాది శ్రీకాకుళం. నగరానికి వచ్చి శిక్షణ తీసుకునేందుకు మూడు నెలలకు కనీసం రూ.30 వేలకుపైగానే అవుతుంది. ప్రభుత్వమే ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో ఉచిత శిక్షణ ఇవ్వడం మంచి అవకాశం. గొప్ప అవకాశంగా భావిస్తున్నాం.

- కె.భాగ్యశ్రీ, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ శిక్షణ అభ్యర్థి

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం గొప్ప లక్ష్యంతో డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజన, వసతి సదుపాయాలను కల్పిస్తోంది. దీనిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ లక్ష్యానికి దూరంగా ఉండిపోకూడదనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వమే శిక్షణ సంస్థలను ఎంపిక చేసి విద్యార్థులు ఇచ్చిన ఆప్షన్స్‌ను బట్టి కోచింగ్ సెంటర్లను కేటాయించింది.

- కె.రామారావు, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్

జూలై 1 వరకు పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనంగా స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. రౌర్కెలా-జగదల్‌పూర్-రౌర్కెల్ ఎక్స్‌ప్రెస్ (18107/ 18108) రైళ్లతోపాటు, రౌర్కెలా-గుణుపూర్-రౌర్కెలా ఎక్స్‌ప్రెస్ (18117/18118) రైళ్లకు జూలై 1 వరకు అదనంగా ఒక స్లీపర్ క్లాసు కోచ్‌ను జత చేస్తున్నామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మత సామరస్యమే ప్రధాన ధ్యేయం

విశాఖ ఆర్సీఎం పీఠాధిపతి బాలశౌరి


జ్ఞానాపురం కెథెడ్రెల్ గ్రౌండ్‌లో వేదికపైకి వస్తున్న పీఠాధిపతులు


ప్రతిష్ఠాపనోత్సవం కార్యక్రమానికి హాజరైన విశ్వాసకులు

జ్ఞానాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యమే తమ లక్ష్యమని విశాఖ ఆర్సీఎం (రోమన్ క్యాథలిక్ మిషన్) అగ్రపీఠాధిపతిగా గురువారం బాధ్యతలు చేపట్టిన ఉడుముల బాలశౌరి అన్నారు. వరంగల్ నుంచి విశాఖకు రావడం దేవుని కృప అని నమ్ముతున్నానన్నారు. గొప్ప మనసు కలిగిన ప్రజల మధ్య సేవ చేసే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. పోప్ ఫ్రాన్సిస్ దూత, భారత్, నేపాల్ దేశాల ఆర్సీఎం సంస్థల అంబాసిడర్ డాక్టర్ లియోపోల్డో గిరెల్లి సమక్షంలో హైదరాబాదు అగ్రపీఠాధిపతి పూల అంతోని ఆధ్వర్యంలో బాలశౌరి ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా జరిగింది. ఏలూరు బిషప్ పొలిమేర జయరావు నుంచి బాలశౌరి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన ఉపన్యసించారు. జ్ఞానాపురం పునీతు పేతురు దేవాలయం మైదానం లో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో విశ్వాసులు హాజరయ్యారు. అంతకు ముందు అగ్రపీఠాధిపతులను సెయింట్ జోసెఫ్ చర్చి నుంచి జ్ఞానాపురం ప్రధాన రహదారి మీదుగా పునీత పేతురు దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ముంబై ఆర్చి బిషప్ కార్డినల్ గ్రేసియస్ ఓస్వాల్డ్ ప్రత్యేక దివ్య బలిపూజ నిర్వహించారు. క్రీస్తు సేవకు తన జీవితాన్ని అంకితమిచ్చిన గొప్ప దైవ సేవకుడని ఈ సందర్భంగా పలువురు పీఠాధిపతులు కొనియాడారు.

నూతన విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాలశౌరిని బిషప్‌లు, ఫాదర్లు, కన్యస్త్రీలు, వివిధ మతాల వారు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కడప బిషప్ పాల్ ప్రకాశ్, విశ్రాంత విశాఖ అగ్రపీఠాధిపతి మల్లవరపు ప్రకాశ్, పునీత పేతురు విచారణ గురువు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్, దుగ్గింపూడి బాలశౌరి, ఎంఎస్ఎఫ్ఎస్ ప్రావిన్షియల్ ఫాదర్ బి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తెలపాలి: డీఈవో

ఆరిలోవ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్స్ నుంచి స్కూలు అసిస్టెంట్ పదోన్నతి కోసం సబ్జెక్ట్ వారీగా తాత్కాలిక సీనియారిటీ జాబితాను విశాఖపట్నం జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అలాగే జిల్లా విద్యాశాఖాధికారి నోటీసు బోర్డులో కూడా అందుబాటులో ఉంచినట్టు డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీనియారిటీ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 4 నుంచి తెలియపరవచ్చని డీఈవో వెల్లడించారు. జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందు పరచిన ఏపీఎల్ ఫార్మాట్‌లో అభ్యంతరాలు తెలియపరచాలన్నారు.అభ్యంతరం వ్యక్తం చేసిన ఉపాధ్యాయుడి పూర్తి పేరు, ఎక్కడ పని చేస్తున్నారు వంటి వివరాలు ఎంపీఐడీలో తెలియ జేయాలన్నారు. జాబితాలో తప్పిదం ఎక్కడ ఉన్నదో స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఆధారాలు లేదా సంబంధిత సాక్ష్యాలు జత చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

లులూ మాల్‌కు భూములు ఇవ్వొద్దు: సీపీఎం



విష్ణుప్రియ ఫంక్షన్ హాల్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బీచ్ రోడ్డు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విలువైన ప్రభుత్వ భూములను లులూ మాల్‌కు కట్టబెట్టే చర్యలు తక్షణమే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డు విష్ణుప్రియ ఫంక్షన్ హాల్ వద్ద గురువారం నిరసన చేపట్టారు. ప్రైవేటు సంస్థకు ప్రభుత్వ భూమిని కట్టబెట్టేశారని, లులూ గ్రూప్‌పై ప్రభుత్వం వల్లమాలిన ప్రేమ చూపిస్తోందని దుయ్యబట్టారు.ఖరీదైన భూమిని నామమాత్రపు లీజుకు ధారాదత్తం చేయడం దారుణమన్నారు. ఆసక్తి వ్యక్తీకరరణ ప్రతిపాదన (ఆర్ఎఫ్‌పీ) నోటిఫికేషన్ జారీ చేయకుండానే వ్యవహారాన్ని పూర్తి చేశారన్నారు. ఇక్కడ ఎకరం భూమి బహిరంగ మార్కెట్‌లో రూ.150 కోట్లపైగా పలుకుతోందన్నారు. నిబంధనల మేరకు ప్రభుత్వ భూమిని 33 ఏళ్లకు మించి లీజుకు ఇచ్చే అవకాశం లేదని, కానీ 99 ఏళ్లకు అప్పగిస్తూ సంస్థ ఛైర్మన్ విధించిన షరతులన్నింటికీ అంగీకరించి కట్టబెట్టడం హేయమన్నారు. ఈ వ్యవహారంలో రూ.కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. నిరసనలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల పరిసరాల్లో ధూమపానం చేస్తే కఠినచర్యలు: సీపీ

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు, కాలేజీలు ఇతర విద్యాసంస్థలకు వంద మీటర్లలోపు ధూమపానం చేస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ శంఖబ్రతబాగ్చి హెచ్చరించారు. ప్రజారోగ్యశాఖ, పోలీస్ అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (సీఓటీపీఏ) అమలుపై శిక్షణ ఇచ్చారు. పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని ప్రమాణం చేయించారు. ఈ సమావేశంలో సీఓటీపీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమోదకుమార్, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పూర్ణేందర్‌రావు తదితరులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు

సింహాచలేశుడి కల్యాణోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

సింహాచలం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చైత్రమాస శుక్లపక్ష దశమి ఈనెల 7వ తేదీన ప్రారంభంకానున్న సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలకు ఈఓ కొమ్ముల సుబ్బారావు సారథ్యంలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధానాలయ గోపురాలకు, ఘాట్‌రోడ్డు రక్షణ గోడలకు రంగులద్దుతున్నారు. అప్పన్నస్వామి రథం ఇరుసులకు గ్రీజులు పెట్టి శోభాయమానంగా రంగులు వేస్తున్నారు. ఉత్తర రాజగోపురానికి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రాంగణంలో కల్యాణ వేదికను సిద్ధం చేస్తున్నారు. కల్యాణోత్సవానికి హాజరుకావాలని మంత్రులు, ప్రజాప్రతినిధులను ఈఓ, మరికొందరిని అధికారులు ఆహ్వానిస్తున్నారు. ఉత్తరాంధ్ర పరిధిలోని పలు ప్రధాన కేంద్రాల్లో ఉత్సవ స్వాగత ద్వారాలను ఏర్పాటుచేయలని విశ్రాంత ఉద్యోగులు సూచిస్తున్నారు.


నిర్మాణ దశలో కల్యాణ వేదిక

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి


ప్రభాకరరావు (ఫైల్)

కొమ్మాది, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. పీఎం పాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బలగా ప్రభాకరరావు(49) భార్య మణి, కుమార్తెతో కలిసి సాయిరాం కాలనీ పేజ్-1లో ఉంటూ తాపీ మేస్త్రిగా పనిచేస్తున్నాడు. అదేకాలనీకి చెందిన కామేశ్వరరావుతో కలిసి గురువారం ద్విచక్రవాహనంపై రాజులతాళ్లవలస బయలుదేరారు. మారికవలస రాజీవ్‌గృహకల్ప, బోరవానిపాలెం మధ్యలో వారి వాహనాన్ని సిమెంట్ కాంక్రీట్ మిక్సింగ్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. దీంతో వెనుక కూర్చున్న ప్రభాకరరావు రోడ్డుపై పడి, కాంక్రీట్ మిక్సింగ్ వాహనం కింద నలిగిపోయాడు. కామేశ్వరావుకు తీవ్రగాయాలవడంతో కేజీహెచ్‌కు తరలించారు. పీఎం పాలెం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

గాజువాక, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన షీలానగర్ జంక్షన్‌లో గురువారం తెల్లవారుజామున జరిగింది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. గాజువాకకు చెందిన లావేటి క్రాంతికుమార్ (28), శ్రీహరిపురానికి చెందిన కె.వాసవి (28) రుషికొండ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఇద్దరూ గురువారం కారులో రుషికొండ నుంచి గాజువాక వస్తుండగా తెల్లవారుజామున కారు అదుపు తప్పి డివైడర్‌ను, రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రికి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటా కోసం వచ్చి.. ప్రాణం తీసుకుంది

- విజయవాడలో ఆత్మహత్య చేసుకున్న విశాఖ మహిళ


మౌనిక మృతదేహం

విజయవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తండ్రి మరణంతో తల్లికి వచ్చిన బీమా సొమ్ములో వాటా అడగడానికి వచ్చిన కుమార్తెను తల్లి, ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తి దూషించడంతో మనస్తాపం చెంది పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే... చిట్టినగర్‌కు చెందిన గుత్తికొండ రమాదేవి భర్త మోహనరావు ఇటీవల మృతిచెందాడు. దీంతో రూ.8లక్షల బీమా సొమ్ము అందింది, వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె విజయలక్ష్మి విజయవాడలో ఉండగా, చిన్న కుమార్తె కామిశెట్టి మౌనిక విశాఖపట్నంలో ఉంటోంది. మౌనిక కొద్దిరోజుల క్రితం తల్లి వద్దకు వచ్చింది. రమాదేవి వెంకటేశ్వరరావు అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈ విషయం తెలిసి మౌనిక మందలించింది. విశాఖ వచ్చి తన వద్ద ఉండాలని కోరింది. తండ్రి బీమా సొమ్ములో తన వాటా ఇవ్వాలని గట్టిగా అడిగింది. దీంతో మౌనికపై రమాదేవి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా బుధవారం రాత్రి రమాదేవి ఇంటికి వెంకటేశ్వరరావు వచ్చాడు. వారిని ప్రత్యక్షంగా చూసిన మౌనిక కోపాన్ని ఆపుకోలేకపోయింది. అతడిని దూషించింది. దీంతో తల్లి కుమార్తెపై ఎదురు తిరిగింది. రమాదేవి, వెంకటేశ్వరరావు కలిసి మౌనికను దూషించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె తన అక్క విజయలక్ష్మి, భర్త కృష్ణశంకర్‌కు ఫోన్‌చేసి తాను చనిపోతున్నానని, పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పింది. బయటకు వచ్చి పురుగుల మందు తాగింది. అక్క విజయలక్ష్మి ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మౌనిక భర్త కృష్ణశంకర్ విజయవాడ చేరుకుని రమాదేవి వేధింపులే మౌనిక ఆత్మహత్యకు కారణమని కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రేమోన్మాదికి 14 రోజులు రిమాండ్

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తనతో పెళ్లికి నిరాకరించారనే అక్కసుతో ఒకరిని హత్య చేసి, మరొకరిని తీవ్రంగా గాయపరిచిన ప్రేమోన్మాది దమరసింగి నవీన్‌కు భీమిలి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. కొమ్మాది స్వయంకృషి నగర్‌కు చెందిన నక్కా దీపిక అనే యువతిని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం మండలం పనసనందివాడకు చెందిన నవీన్ ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తనతో పెళ్లి చేయడానికి ఆమె తల్లి లక్ష్మి నిరాకరించడం, దీపిక నచ్చజెప్పే ప్రయత్నం చేయకపోవడాన్ని సహించలేకపోయిన నవీన్ బుధవారం కత్తితో వారిపై దాడి చేశాడు. దీంతో లక్ష్మి మృతి చెందగా, దీపిక తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. దాడి అనంతరం నవీన్ బైక్‌పై శ్రీకాకుళం వైపు పరారైపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసిన పీఎంపాలెం పోలీసులు గురువారం భీమిలి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

దీపికను పరామర్శించిన ఎమ్మెల్యేలు


దీపిక ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యేలు గంటా, విష్ణుకుమార్‌రాజు

మధురవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దీపికను గురువారం భీమిలి, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. బాధితురాలికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే గంటా పేర్కొన్నారు.

100 కేజీల గంజాయి పట్టివేత


పట్టుబడిన గంజాయి

కూర్మన్నపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం నుంచి హైదరాబాద్‌కు 44 బ్యాగుల్లో తరలిస్తున్న 100 కేజీల గంజాయిని గురువారం రాత్రి దువ్వాడ పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు కూర్మన్నపాలెం కూడలిలో పోలీసులు తనిఖీ చేస్తుండగా ఢిల్లీకి చెందిన ముఠా గంజాయి తరలించేందుకు యత్నిస్తూ పట్టుబడింది. పోలీసులను చూసి ముఠాలోని నలుగురు పరారవగా, ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. మిగిలిన వారి కోసం పోలీసులు బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారని సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేషన్ డిపో డీలరు, ఎండీయూపై కేసు

అక్కయ్యపాలెం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెంలోని చిన్నవూరు మసీదు సమీపంలో డిపో నంబరు 29ను జిల్లా పౌరసరఫరాల అధికారి కల్యాణి బుధవారం తనిఖీ చేశారు. రికార్డుల్లో ఉన్న నిల్వ కంటే అదనంగా బియ్యం ఉన్నాయి. ఎండీయూ వాహనంలో కూడా అదనంగా బియ్యం ఉన్నట్టు తనిఖీలో వెల్లడైంది. స్వయంశక్తి సంఘం ఆధ్వర్యంలో నడిచే ఈ డిపో డీలరు పార్వతి, ఎండీయూ ఆపరేటర్ ఫరూక్‌పై 6-ఎ కేసు నమోదుచేశారు.

విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగుల భవనంలో గురువారం ఈపీడీసీఎల్ జేఏసీని ఏర్పాటు చేశారు. రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఎంవీ రాఘవరెడ్డి అధ్యక్షతన ఛైర్మన్‌గా ఎం.రమేష్ ,కన్వీనర్‌గా భూక్యా నాగేశ్వరరావు, కో కన్వీనర్‌గా జోగినాయుడు, వైస్ ఛైర్మన్లుగా బాలాజీ, తురగా రామకృష్ణఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంవీ గోపాలరావు, గణపతి, బిసాయి, కృష్ణ, శ్రీనివాసకుమార్, పి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జూ క్యూరేటర్‌కు డీఎఫ్‌వో బాధ్యతలు

విశాఖపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ మంగమ్మకు జిల్లా అటవీశాఖాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న డీఎఫ్‌వో బాధ్యతలను సబ్ డీఎఫ్‌వో వాణి నిర్వహిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో మంగమ్మ ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు.